PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 100 | విజయవాడ, శుక్రవారం 10 నవంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Friday 10 November 2023 | Rs

టెన్త్ ఫీజు చెల్లింపు గడువు పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు గడువు ఈ నెల 20 వరకు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి దేవానందరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల పదో తేదీతో ఫీజు చెల్లింపు గడువు ముగియనుండగా, ఈ నిర్ణయం తీసుకున్నారు. రూ.50 అపరాధ రుసుంతో ఈ నెల 25 వరకు, రూ.200 అపరాధ రుసుంతో 30 వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబరు 5 వరకు చెల్లించవచ్చునని పేర్కొన్నారు.

గురి తప్పని మహిళా ఆర్చర్లు

- ఒకేరోజు మూడు స్వర్ణాలు
- ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్స్

8

ముప్పేట దాడి

- ప్రతిపక్ష నేతలే లక్ష్యం
- ఎన్నికల వేళ సోదాలు, అరెస్టులు, వేధింపులు
- కేంద్ర దర్యాప్తు సంస్థల స్వామిభక్తి

ఎన్నికలు జరుగుతున్న మధ్యప్రదేశ్‌లో ఆ రాష్ట్ర పంచాయతీ శాఖ మంత్రి మహేంద్ర సింగ్ సిసోడియా ఇటీవల ' బిజెపిలో చేరండి... లేకుంటే బుల్డోజర్ దాడికి సిద్ధంగా ఉండండి' అంటూ కాంగ్రెస్ నేతలకు హెచ్చరిక జారీ చేశారు. తెలంగాణలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను తీహార్‌జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలంటూ ఆ రాష్ట్రానికే చెందిన ఎన్‌డిఎ భాగస్వామి హెచ్‌డి కుమారస్వామి హెచ్చరించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ త్వరలోనే జైలుకు వెళ్తారంటూ బిజెపి నేతలు బాహాటంగానే చెబుతున్నారు! కేంద్ర దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), ఆదాయపన్నుశాఖ (ఐటి)లు ఎలా వ్యవహరిస్తున్నాయో చెప్పడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే!

న్యూఢిల్లీ : ఓ వైపు రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైఉంటే, మరోవైపు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇదే అదునుగా దాడులను ముమ్మరం చేస్తున్నాయి. దీనికోసం ప్రతిపక్ష నేతల వద్ద గతంలో పనిచేసిన వారిని నయానో, భయానో ఒప్పించి వారిచేత తప్పుడు సాక్ష్యం చెప్పిస్తున్నారన్న ఆరోపణలూ వస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌పై చేసిన అవినీతి ఆరోపణ ఈ తరహాకు చెందినదే. బఘేల్‌కు రూ.508 కోట్లు ఇచ్చానంటూ ఓ వ్యక్తి చెప్పడంతో ఆయనపై దర్యాప్తు ప్రారంభమైంది. ప్రధానితో సహా బిజెపి నాయకులందరూ దీనికి ఎన్నికల అంశంగా మార్చేశారు. గతంలో ఢిల్లీతో పాటు అనేక రాష్ట్రాల్లో ఈ తరహా సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో నే ఎన్నికలకు ఐదు రోజుల ముందు ఇడి ఐదు కోట్ల రూపాయలు స్వాధీనం చేసుకుంది. బెట్టింగ్ యాప్ ద్వారా ఓ రాజకీయ పార్టీకి ఈ డబ్బు అందిందని ఆరోపించింది. తెలంగాణలో ఈ నెల 2న కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల ఇళ్లపై దాడులు చేశారు. ఎంత సొమ్ము స్వాధీనం చేసుకున్నదీ వెల్లడించలేదు. రాజస్థాన్‌లో జల జీవన్ మిషన్‌కు చెందిన 25 ప్రదేశాలపై ఈ నెల 3న ఇడి దాడి చేసింది. ఆ రాష్ట్రంలో ఒకే రోజు పిసిసి అధ్యక్షుడుతో పాటు ఇతర కాంగ్రెస్ నేతల నివాసాలపై ఇడి దాడులు చేసింది. వేర్వేరుకేసులను దీనికి కారణంగా చూపించింది. రాజస్థాన్ మంత్రి రాజేంద్ర యాదవ్‌పై మధ్యాహ్న భోజన పథకం కుంభకోణం కేసు పెట్టారు. ఆ రాష్ట్రంలో మొత్తంమీద తొమ్మిది మంది నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థల కేసులు నడుస్తున్నాయి. వారిలో ముఖ్యమంత్రి గెహ్లాట్ కుమారుడు, సోదరుడు, మంత్రులు, సీనియర్ కాంగ్రెస్ నేతలు ఉన్నారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నేత కమల్‌నాథ్ కుమారుడు రతుల్ పురీని ఇడి అధికారులు ప్రశ్నించారు.

ప్రతిపక్ష ఇండియా వేదికలోని అన్ని పార్టీల నేతలు, మంత్రులు జైళ్లలోనో లేదా ఈడీ నిఘాలోనే ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వానికి చెందిన ముగ్గురు మంత్రులు జైలులో కాలం గడుపుతున్నారు. ఇప్పుడు నాలుగో మంత్రిపై దాడులు మొదలయ్యాయి.

బిజెపి నేతల జోలికి పోరా?

ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్న కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇప్పటి వరకు ఒక్క బిజెపి నాయకుడినిగాని, ఎన్‌డిఎ భాగస్వామ్య పక్ష నాయకుడి జోలికి గాని వెళ్లకపోవడం గమనార్హం. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ 'ఇడి మీద నాకు కేవలం ఒకే ఒక రోజు పెత్తనం ఇవ్వండి. బిజెపి సీనియర్ నాయకులందరూ జైలులో ఉంటారు'. అని అన్నారు. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ 'లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకుల ఇళ్లపై దాడులు చేయించి కుట్రలు పన్నడమే మీ ఉద్దేశ్యమా' అని కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నించారు. తమిళనాడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీని ఇటీవల విచారించిన ఇడి అధికారులు ఆయన్ను బిజెపిలో చేరాలని, లేని పక్షంలో దర్యాప్తును ఎదుర్కొవాలని బెదిరించారు.

లోపలి పేజీలో...

పొంగులేటి ఇంట్లో ఐటి, ఇడి తనిఖీలు

ఇడి దుర్వినియోగం
- ఇసికి కాంగ్రెస్ ఫిర్యాదు

4 నుంచి పార్లమెంటు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు 4 నుంచి 22 వరకు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. 15 రోజులపాటు ఉభయ సభల కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు గురువారం ఆయన తెలిపారు. పార్లమెంటు వ్యవహారాలు, ఇతర అంశాలపై అమృత్‌కాల్‌లో ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు. ఐపిసి, సిఆర్‌పిసి, ఎవిడెన్స్ యాక్టులను మార్చుతూ ప్రతిపాదించిన బిల్లులపై సమావేశాల్లో చర్చ జరగవచ్చునని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇటీవల ఈ మూడు నివేదికలను హోంశాఖ స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. ఎన్నికల కమిషనర్ల బిల్లు కూడా ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. ఇటీవల ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టుల ఫోన్లపై నిఘా, ఫోన్లను హ్యాక్ చేస్తారని ఐఫోన్ అలర్ట్ మెసేజ్ వంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తనున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు డిసెంబర్ 3న విడుదల కానుండగా, 4 నుంచి సమావేశాలు ప్రారంభం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

కొనసాగుతున్న హెటిరో డ్రగ్స్ రెండో పైపులైన్ పనులు

ఆగని హెటిరో పనులు

- భారీగా పోలీసుల మోహరింపు
- మత్స్యకారులకు బెదిరింపులు
- వైసిపి, టిడిపి మౌనం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణల కోసం దాదాపు రెండు సంవత్సరాలుగా మత్స్యకారులు పోరాటం చేస్తున్నా ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదు. పేదల పక్షాన ఉంటామని అట్టహాసంగా చెబుతున్న ప్రభుత్వ పెద్దలు ఆచరణలో కార్పొరేట్ల కొమ్ము కాస్తున్నారనడానికి హెటిరో డ్రగ్స్ పనులు మళ్లీ ప్రారంభమైన తీరే నిదర్శనం. మత్స్యకారులను తీవ్ర స్థాయిలో బెదిరించారు. విషయం బయటకు పొక్కకుండా భారీ ఎత్తున పోలీసులను మోహరించి నాలుగు రోజుల క్రితం పనులు ప్రారంభించేశారు. ఇంత జరుగుతున్నా స్థానిక వైసిపి, టిడిపి నేతలు ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం గమనార్హం. ఈ ప్రాంతాన్ని గురువారం పరిశీలించిన ప్రజాశక్తికి 2021 డిసెంబర్ 1 నుంచి మత్స్యకారులు నిర్వహిస్తున్న ధర్నా శిబిరంలో పోలీసులే కనిపించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో హెటిరో డ్రగ్స్ ప్రభావిత గ్రామాలు రాజయ్యపేట, బోయపాడు, పెదతీనార్ల, దొండవాక, చినతీనార్ల మత్స్యకారులు హెటిరో డ్రగ్స్ రెండో పైపులైన్ పనులను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్‌జిటిలో వేసిన కేసు విచారణ ఒకవైపు జరుగుతుండగానే అనుమతులన్నీ వచ్చేశాయని చెబుతూ రెండో పైపు లైన్ పనులను యాజమాన్యం ప్రారంభించింది. అనుమతులకు సంబంధించిన ఒక్క కాగితాన్ని కూడా తమకు చూపలేదని మత్స్యకారులు చెబుతున్నారు. అదేసమయంలో పోలీసులు హెటిరో తరపున మాట్లాడుతూ, తమను బెదిరిస్తున్నారని వారు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ, అటవీశాఖ భూముల్లో ఆ శాఖల అనుమతుల్లేకుండానే రెండో పైప్‌లైన్‌ను హెటిరో యాజమాన్యం వేస్తుందన్న అనుమానాలను వారు వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు పాతర

హెటిరో యాజమ్యాం మొదటి నుండి నిబంధనలను పట్టించుకోవడం లేదు. సిఆర్‌జెడ్‌లో ఎటువంటి నిర్మాణాలూ చేపట్టకూడదని స్పష్టంగా నిబంధనలు ఉన్నప్పటికీ మూడు డీశాలినేషన్ ప్లాంట్లను యాజమాన్యం నిర్మించింది. హెటిరో ఉల్లంఘనలను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) ఎత్తిచూపింది. ఎన్‌జిటి నియమించిన జాయింట్ కమిటీ తన నివేదికలో హెటిరో యాజమాన్యం పర్యావరణ ఉల్లంఘనలకు పాల్పడినట్లు పేర్కొనడంతో పాటు రూ.6.94 కోట్లు అపరాధ రుసుము విధించాలని సిఫార్సు చేసింది. ఆ సిఫార్సు అమలైన దాఖలా కనిపించడం లేదు. హెటిరో గ్రూపు చైర్మన్ పార్ధసారథి రెడ్డి బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సిపిఎం ఫిర్యాదు

రెండో పైపులైన్ పనులు ప్రారంభించడంపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు కలెక్టర్‌కు, ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పనుల పరిశీలనకు రెవెన్యూ అధికారులతో కమిటీని వేస్తున్నట్లు తెలిపారు. పైపులైన్ పనులను ఆ కమిటీ పరిశీలించినా ఫలితం కనిపించలేదు.

కలిసే ముందుకు

- టిడిపి, జనసేన రాజకీయ జెఎసి నిర్ణయం
- బిజెపి మాతో కలవదనుకోవడం ఊహాజనితం : మనోహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు కలిసి పనిచేయాలని టిడిపి, జనసేన రాజకీయ జెఎసి నిర్ణయించింది. టిడిపి-జనసేన సమన్వయ కమిటీ సమావేశం విజయవాడలో ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం జరిగింది. సమావేశ నిర్ణయాలను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మీడియాకు వివరించారు. గవర్నరును కలవాలన్నా, ఢిల్లీ వెళ్లాలన్నా, ఎన్నికల కమిషన్‌ను కలవాలన్నా ప్రతి అంశంలోనూ రెండు పార్టీలు కలిసే వెళ్లాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కరువుపై కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో రోడ్లకు మరమ్మతులు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు, నకిలీ మద్యం, విద్యుత్ ఛార్జీల పెంపు, నిత్యావసర సరుకుల ధరలు, ఇసుక అక్రమాలు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీలపై దమనకాండ, ఓటర్ జాబితా అక్రమాలు, పంచాయతీ నిధుల దారిమళ్లింపు, ఉద్యోగుల సమస్యలు తదితర ప్రజా సమస్యలపై కలిసే పోరాటం చేస్తామన్నారు. నాలుగున్నరేళ్లుగా ఉద్యోగాలు, నోటిఫికేషన్లు లేక అల్లాడుతున్న యువత సమస్యపై త్వరలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాష్ట్రానికి పట్టిన శని జగన్‌మోహన్‌రెడ్డిని వదిలించడమే రెండు పార్టీల మొదటి లక్ష్యమని చెప్పారు. ఈ నెల 13న ఉమ్మడి మేనిఫెస్టో కమిటీ సమావేశం ఉంటుందని అన్నారు. టిడిపి చేపట్టిన భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో జనసేన ఇచ్చిన కొన్ని అంశాలను కలిపి ఈ నెల 17 నుంచి ఉమ్మడిగా నిర్వహిస్తామని తెలిపారు. 18, 19 తేదీల్లో రోడ్ల దుస్థితిపై క్షేత్రస్థాయిలో ఆందోళన చేపడతామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బహిరంగ సభల్లో ఇరు పార్టీల అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, పవన్

మిగతా 2లో

30 వరకు చంద్రబాబును అరెస్టు చేయొద్దు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఫైబర్ నెట్ కేసులో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును ఈ నెల 30 వరకు అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ కేసులోనూ 17ఎ ఉన్నందున స్కిల్ డెవలప్‌మెంటు కేసు తీర్పు వచ్చిన తరువాతే, ఈ కేసు విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. కేసు ముగిసేవరకు అరెస్టు చేయొద్దన్న నిబంధన కొనసాగించాలని చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా.. ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా, గత హామీ మేరకు ఉంటామని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, రంజిత్ కుమార్ తెలిపారు. ఈ కేసు విచారణ నవంబరు 30న చేపడతామని, అప్పటి వరకూ చంద్రబాబును అరెస్టు చేయొద్దని ఆదేశించింది. ఎపి స్కిల్ డెవలప్‌మెంటు కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై దీపావళి పండగ తరువాత తీర్పును వెల్లడిస్తామని ధర్మాసనం వెల్లడించింది.

ఇజ్రాయిల్‌కు మోడీ మద్దతు దారుణం

- హానికర బిజెపిని వీడండి
- వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు సిపిఎం పిలుపు
- ప్రజారక్షణ భేరి యాత్ర ముగింపు సభలో గఫూర్

గుంటూరు సభలో ప్రసంగిస్తున్న ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పాలస్తీనా ప్రజలను ఊచకోతకోస్తున్న ఇజ్రాయిల్‌కు భారత ప్రభుత్వం మద్దతు పలకడం దారుణమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ విమర్శించారు. గత నెల 30న కర్నూలు జిల్లా ఆదోని నుంచి ప్రారంభమైన ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర గుంటూరు జిల్లా ఉండవల్లిలో గురువారం ముగిసింది.ఆయా చోట్ల జరిగిన సభల్లో గఫూర్ మాట్లాడుతూ.. గతంలో గుజరాత్‌లో ముస్లింలను నరమేథం చేసిన నరేంద్ర మోడీ ఇప్పుడు ఇజ్రాయిల్‌కు మద్దతు పలుకుతున్నారని అన్నారు. మానవత్వం లేని, రాక్షస ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉందని, స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నడూ లేనంతగా మైనార్టీలపై ఊచకోతకు పాల్పడుతోందని విమర్శించారు. పాలస్తీనా భూ భాగం పాలస్తీనీయులదేనని మహాత్మాగాంధీ కూడా చెప్పారన్నారు. అమెరికా మద్దతుతో రెచ్చిపోతున్న ఇజ్రాయిల్‌కు మోడీ మద్దతు పలకడం దారుణమ న్నారు. ఇప్పటికే పదివేల మంది పాలస్తీనియులు చనిపోయారని, వారిలో 4500 మంది పిల్లలు, మహిళలున్నారని తెలిపారు. తక్షణమే పాలస్తీనాకు భారతప్రభుత్వం సంఘీభావం తెలపాలని డిమాండ్ చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ.. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను, బ్యాంకులు, రైల్వే, బొగ్గు గనులు, విమానయానం, బీమా తదితర పరిశ్రమలను హోల్‌సేల్‌గా అమ్మేస్తున్నారని విమర్శిం చారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు గనులు కేటాయిస్తే లాభాలు తెచ్చి చూపిస్తామని కార్మికులు చెబుతున్నారని, కానీ కేంద్రం మాత్రం టాటా, జిందాల్ వంటి కార్పొరేట్లకు గనులు కేటాయిస్తూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మొండి చేయి చూపిస్తోంద న్నారు. రాష్ట్రంలో 400 మండలా ల్లో కరువు నెలకొంటే రాష్ట్ర ప్రభుత్వం 103 మండలాలు ప్రకటించడం సరికాదన్నారు. ప్రకటించిన మండలాల్లోనూ రైతులు, వ్యవసాయ కార్మికులనూ

ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు లేవన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం బిజెపి వ్యతిరేక శక్తులతో కలిసి పని చేయడమే లక్ష్యంగా ఉన్నామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పది లక్షల కోట్లు అప్పు చేశారని, ప్రతినెల రూ. నాలుగు వేల కోట్లు అప్పు లేనిదే రాష్ట్ర మనుగడ సాగడం లేదన్నారు. ఉద్యోగులకు, మున్సిపల్ కార్మికులకు, పంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు అందటం లేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తుందని, బిటెక్, ఎంటెక్, ఎంబిఎ చదివిన వారుఉపాధి కోసం ఆటోలు

మిగతా 2లో

అభివృద్ధిలో పులివెందుల ఆదర్శం

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

గుడిసెలు తొలగించిన చోటే ఇళ్లు నిర్మించాలి

- కలెక్టరేట్ ఎదుట బాధితుల ధర్నా

ఎసిబి వలలో చుండూరు పోలీసులు

- ఎస్సై, రైటర్, కానిస్టేబుల్‌పై కేసు

లోపలి పేజీలో...

ఎంపి, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులను త్వరగా విచారించాలి

- హైకోర్టులకు సుప్రీం ఆదేశం
- ట్రయల్ కోర్టు విచారణను వాయిదా వేయకూడదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజా ప్రతినిధులపై నమోదైన తీవ్రమైన నేరాల (క్రిమినల్ కేసులు) విచారణలను వేగంగా పూర్తి చేసేందుకు కచ్చితమైన, ఏకరీతి మార్గదర్శకాలు రూపొందించడం క్లిష్టమైన ప్రక్రియ అని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అటువంటి కేసులను సమర్థవంతంగా పర్యవేక్షించడానికి చర్యలు తీసుకునే బాధ్యతను హైకోర్టులకు అప్పగించింది. తీవ్రమైన నేరాలకు పాల్పడిన ఎంపి, ఎమ్మెల్యేలు ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాలం నిషేధించాలని న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ప్రజా ప్రతినిధులపై దాఖలైన క్రిమినల్ కేసులను త్వరితగతిన విచారించాలని హైకోర్టులను ఆదేశించింది. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర విచారణ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన లేదా ప్రధాన న్యాయమూర్తి నియమించిన ధర్మాసనం ప్రత్యేక బెంచీలను ఏర్పాటు చేయాలని, కేసులను జాబితా చేయాలని పేర్కొంది. ఈ కేసులు ఏడాది లోపే పరిష్కరించాలని హైకోర్టులను ఆదేశించింది. క్రిమినల్ కేసుల సత్వర విచారణకు అవసరమైన పర్యవేక్షణ కోరుతూ సుమోటో కేసులు నమోదు చేయాలని హైకోర్టులను ధర్మాసనం ఆదేశించింది.

ట్రయల్ కోర్టులు అత్యవసరమైతే తప్ప ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల విచారణలు వాయిదా వేయకూడదని సుప్రీం ఆదేశాల్లో పేర్కొంది. కేసుల సత్వర పరిష్కారానికి వెబ్‌సైట్‌ను సిద్ధం చేయాలని ఆదేశించింది. కేసుల వివరాలను జిల్లా, ప్రత్యేక న్యాయస్థానాల నుంచి సేకరించి హైకోర్టు వెబ్‌సైట్‌లో ప్రత్యేక ట్యాబ్ ఏర్పాటు చేసి అందులో పొందుపరచాలని హైకోర్టులకు సూచించింది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతికతను జిల్లా న్యాయస్థానాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించింది. దోషిగా తేలిన ఎంపి, ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధంపై విచారణ జరుపుతామని, ఈ అంశంపై ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - ఉక్కునగరం, అనకాపల్లి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గంగవరం గ్రామం నుంచి పూడిమడకకు ద్విచక్ర వాహనంపై సోమేశ్, రాజు, వాసు బయలుదేరారు. ఉక్కునగరం సెక్టార్ 11 నుంచి దేశపాత్రునిపాలెం వెళ్లే రహదారిలో మలుపు తిరిగే సమయంలో వాహనాన్ని అదుపు చేయలేక మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొన్నారు. సోమేశ్, వాసు అక్కడిక క్కడే మరణించారు. రాజు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ముగ్గురూ మత్స్యకార కుటుంబాలకు చెందిన విద్యార్థులు. నర్సీపట్నం నుంచి పెందుర్తి వైపునకు కారులో విశాఖ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టు మాజీ రీజనల్ మేనేజర్ సుధాకర్ బయలుదేరారు. అనకాపల్లి మండలం శంకరం ఫ్లైఓవర్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అక్కడికక్కడే ఆయన మరణించారు. ఎంతోమంది నిరుద్యోగు లకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేసినట్టు సుధాకర్‌పై అనేక ఆరోపణలు ఉన్నాయి.

బహిరంగసభలో మాట్లాడుతున్న రాఘవులు, వేదికపై తమ్మినేని, శ్రీకాంత్ తదితరులు

రాజకీయ దళారులకు ప్రజాపోరాటాలకు మధ్య పోటీ

- బిజెపిని ఓడించే శక్తి సిపిఎం ఒక్కటే : బివి రాఘవులు
- పాలేరుకు తమ్మినేని, ఖమ్మం నుంచి శ్రీకాంత్ నామినేషన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అవకాశ వాద పార్టీలకు కాకుండా సిపిఎం పార్టీకి వేసే ప్రతి ఓటు ఆయుధమని, మిగతా పార్టీలకు వేసే ఓటు బేరమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. సిపిఎం పార్టీకి వేసే ఓటు పోరాటాన్ని బలపరచడానికి, అవకాశవాద పార్టీలను కడిగిపారేసేందుకని చెప్పారు. వామపక్షాల అవసరమేంటో రుజువు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం, పాలేరు సిపిఎం అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన బహిరంగసభలో రాఘవులు ప్రసంగించారు. వామపక్షాలకు కాకుండా బూర్జువా పార్టీలకు ఓట్లేస్తామనడం సరికాదన్నారు. రాజకీయాలను ఉద్యమ

మిగతా 2లో

నేటితో ముగియనున్న నామినేషన్ల పర్వం

- తెలంగాణ సిఎం కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు సహా పలువురు నామినేషన్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఘట్టం తుదిదశకు చేరుకుంది. శుక్రవారంతో నామినేషన్ల ప్రకియ ముగియనుంది. గురువారం మంచి ముహూర్తమని భావించిన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్ వేశారు. ఆయా పార్టీల ర్యాలీలతో నియోజకవర్గ కేంద్రాలు మార్మోగాయి. గజ్వేల్, కామారెడ్డిలో బిఆర్ఎస్ అధ్యక్షులు, సిఎం కెసిఆర్ నామినేషన్లు వేశారు. సిరిసిల్లలో కెటిఆర్, సిద్దిపేటలో హరీశ్ రావు నామినేషన్లు వేశారు. మంత్రులు నిరంజన్ రెడ్డి జగదీష్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, కప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్‌లు నామినేషన్లు వేశారు. పాలేరులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఖమ్మంలో సిపిఎం అభ్యర్థి శ్రీకాంత్ నామినేషన్లు దాఖలు చేశారు. పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా నామినేషన్ వేశారు. బుధవారం వరకు 119 నియోజకవర్గాల్లో 1,188 మంది అభ్యర్థులు 1,345 నామినేషన్లను దాఖలు చేసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మైనింగ్, బ్లాస్టింగ్ వల్ల ఇబ్బందులు పడుతున్నాం

- పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణకు ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు

ప్రజాశక్తి - రెంటచింతల (పల్నాడు జిల్లా)

ఫ్యాక్టరీ నిర్మాణ సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారని, మైనింగ్, బ్లాస్టింగ్‌ల వల్ల ఇబ్బదులు పడుతున్నామని జెట్టిపాలెం గ్రామస్తులు ఆవేదన వెలిబుచ్చారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలంలోని సత్రశాల వద్ద ఉన్న పరాశక్తి సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు సంబంధించిన సిమెంట్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన భూసేకరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణను ఫ్యాక్టరీ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఇ.ఇ. నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఎల్.శివశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెట్టిపాలెం గ్రామానికి చెందిన పలువురు రైతులు మాట్లాడుతూ.. ఫ్యాక్టరీ మైనింగ్, బాస్టింగ్ వల్ల దుమ్ము ధూళితో పంట పొలాలు నాశనం అవుతున్నాయని, వంటిపై దద్దుర్లు వస్తున్నాయని, బోర్లలో నీరు రావడం లేదని, ప్రధాన రహదారులపై వాహనాలు ఎక్కువగా తిరగడం వల్ల పిల్లలను బడికి పంపాలన్నా భయంగా ఉందని తెలిపారు. తమ పొలం చుట్టూ ఫ్యాక్టరీకి సంబంధించిన భూములు ఉన్నాయని, దుమ్ము కారణంగా దిగుబడి తగ్గి నష్టాలొస్తున్నాయని, ఈ నేపథ్యంలోనే తన భర్త, కుమారుడు ఆత్మహత్యాయత్నం చేశారని ఓ మహిళ వాపోయరారు. దీనిపైన స్పందనలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణ సమయంలో స్థానికులకే ఉద్యోగాలిస్తామన్న యాజమాన్యం డైలీ లేబర్, కాంట్రాక్టు ఉద్యోగాలనే ఇచ్చిందని మరికొందరు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఫ్యాక్టరీని రూ.90 కోట్లతో విస్తరించే ప్రతిపాదన ఉందని తెలిపారు. దీనివల్ల 25 ఉద్యోగాలు రాబోతున్నాయని, వీటిని గ్రామాల వారీగా కేటాయిస్తామని చెప్పారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఈనెల 22న మరోసారి చర్చిద్దామని తెలిపారు. .ఫ్యాక్టరీకి అనుకూలంగా కొందరు మాట్లాడగా వారిని ఇతరులు అడ్డుకోవడంతో కొద్దిసేపు గందరగోళం తలెత్తింది. పోలీసులు కలుగజేసుకుని సర్దిచెప్పారు. ఇదిలా ఉండగా.. రహదార్లు, విద్యుత్, తాగునీరు వంటి సమస్యలను పరిష్కరిస్తే కంపెనీకి భూములిచ్చేందుకు తాము సిద్ధమని గ్రామస్తులు అంగీకరించినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఫ్యాక్టరీ సిజిఎం జి.ధర్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు, ఆర్‌డిఒ జివి రమణకాంత్‌రెడ్డి, తహశీల్దార్ పుల్లారావు, ఎంపిడిఒ మహాలక్ష్మి, ఎంపిపి డి.చౌడేశ్వరి, సర్పంచ్ డి.విజయకుమారి పాల్గొన్నారు.

గొడవపడుతున్న వారికి సర్దిచెబుతున్న పోలీసులు, ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

రైతులపై దాడి చేసిన వారికి ఓటమే శిక్ష

- కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని ఓడించడం చారిత్రక బాధ్యత
- కిసాన్ మహా పంచాయత్‌లో నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతుల మృతికి కారణమైన వారిపై రైతులే ప్రతీకారం తీర్చుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలు పిలుపునిచ్చారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని ఓడించడం రైతుల చారిత్రక బాధ్యత అని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దీమాని (ఖాదియహార్)లో భారీ కిసాన్ మహాపంచాయత్ జరిగింది. దాదాపు ఐదు గంటల పాటు జరిగిన ఈ మహా పంచాయత్‌లో కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. సంయుక్త కిసాన్ మోర్చా తీసుకున్న నిర్ణయం మేరకు 'కార్పొరేట్‌ను తరిమికొట్టండి, బిజెపిని శిక్షించండి, దేశాన్ని రక్షించండి' అనే ప్రచారంలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని మొరెనా, డిమానీల్లో కూడా ఎస్‌కెఎం నేతలు బిజెపికి వ్యతిరేకంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌కెఎం నేత, ఎఐకెఎస్ కోశాధికారి పి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. కేరళ ప్రభుత్వం ఎంఎస్‌పితో కూరగాయలు కొనుగోలు చేస్తుందని, కూరగాయలకు రూ.2,820 మద్దతు ధర ఇచ్చిందని తెలిపారు. అలాంటప్పుడు మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయలేకపోతున్నదని ప్రశ్నించారు. రైతుల భూములను అదానీ, అంబానీకి అప్పగించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చింద న్నారు. దీనికి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి ప్రత్యక్ష బాధ్యత వహించాలని, అందుకే ఆయనను ఓడించి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కిసాన్ సంఘర్ష్ సమితి జాతీయ అధ్యక్షులు సునీలం మాట్లాడుతూ.. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి సొంత నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోనూ రైతులకు ఆరు గంటలు కరెంటు కూడా అందడం లేదన్నారు. ఎరువుల కోసం గంటల తరబడి క్యూలో నిలబడినా లాఠీచార్జి ఎదుర్కోవాల్సి రావడం దారుణమన్నారు. మినుము ధర కంటే రూ.1000 తక్కువకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. మందసౌర్‌లో ఆరుగురు రైతులను కాల్చిచంపడానికి కారణమైన బిజెపి ప్రభుత్వాన్ని, రైతులపై బలవంతంగా మూడు రైతు వ్యతిరేక చట్టాలను ప్రయోగించి 725 మంది రైతులు అమరులవ్వడానికి కారణమైన కేంద్ర వ్యవసాయ మంత్రిని ఓడించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. లఖింపూర్ ఖేరీ ఘటనలో రైతులను చితకబాదడంలోనూ, కార్లతో తొక్కించి హతమార్చడంలోనూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా టెనీతో పాటు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌దే బాధ్యత అని తేరాయ్ ఫార్మర్స్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షులు తేజేంద్ర సింగ్ విర్క్ అన్నారు.

దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కేంద్రానిదే బాధ్యత

- పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కేంద్రమే బాధ్యత వహించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1001వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్, ఎం అండ్ ఎస్‌టిఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించకపోవడం వల్లే ఉత్పత్తి కుంటుపడి నష్టాల్లోకి వెళ్తోందన్నారు. సకాలంలో రా మెటీరియల్ సరఫరా జరగకపోవడం వల్లనూ నష్టాలు పెరుగుతున్నాయని తెలిపారు. కేంద్రంలోని మోడీ సర్కారు ఇప్పటికైనా విశాఖ ఉక్కుపై కుట్రలను ఆపి ఉత్పత్తి సజావుగా సాగేలా చూడాలన్నారు. లేని పక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, ఉద్యోగులు డి.దేముడు, జి.ఆనంద్, ఎంకెవి.రాజేశ్వరరావు, డి.రమేష్, వర్మ పాల్గొన్నారు.

బిడ్డ ఎలా అవుతావు జగన్?

- టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనాన్ని కేన్సర్ గడ్డలా పట్టి పీడిస్తున్న సిఎం జగన్ బిడ్డ ఎలా అవుతావని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రశ్నించారు. ఒక్క యూనిట్ కూడా వాడని ఇంటికి రూ.295 కరెంటు బిల్లు బాదుడని ట్విట్టర్ (ఎక్స్)లో గురువారం పొందుపరిచారు. సొంత పేపర్, ఛానెల్, సిమెంటు, విద్యుత్ కంపెనీలు, ఊరికో ప్యాలెస్ ఉన్న అవినీతి అనకొండ, పెత్తందారుడు జగన్ అని విమర్శించారు. పేదలకు రూపాయి స్కీమ్ ఇచ్చి వెయ్యి రూపాయలు దోచే స్కామ్ అని ఆరోపించారు.

చంద్రబాబు పేరుతో తప్పుడు లేఖ : వర్ల రామయ్య

తమ పార్టీ అధినేత చంద్రబాబు పేరుతో సోషల్ మీడియాలో వైసిపి తప్పుడు లేఖతో ప్రచారం చేస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం త్వరలో అంతం కాబోతుండటంతో వికృత చేష్టల ద్వారా లబ్ధిపొందాలని వైసిపి చూస్తోందన్నారు. సజ్జల, ఆయన కుమారుడు భార్గవ్ రెడ్డి టిడిపి శ్రేణులను పక్కదారి పట్టించేందుకు చంద్రబాబు సంతకంతో తప్పుడు లేఖ రాసి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు లేఖపై ఫిర్యాదు చేసేందుకు సిఐడి అడిషనల్ డిజి సంజయ్ అపాయింట్‌మెంటు అడిగినా స్పందించలేదన్నారు. తన ఫిర్యాదును మెయిల్ ద్వారా పంపానని చెప్పారు. భార్గవ్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇబ్రహీంపట్నం రణరంగం

- బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాళ్లదాడి
- 100 మంది వరకు ఇరు పార్టీల కార్యకర్తలకు తీవ్ర గాయాలు
- ఎల్‌బి నగర్ డిసిపి సహా 10 మంది పోలీసులకు గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇబ్రహీంపట్నంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ నామినేషన్ల ర్యాలీలు రణరంగమై యుద్ధవాతావరణం తలపించింది. ఇరు పార్టీల నుంచి రాళ్ల వర్షం కురిసింది. రాళ్లదాటికి వందల మంది వరకు గాయాలపాలయ్యారు. పదుల సంఖ్యలో వాహనాలు ధ్వంసమయ్యాయి. ఊహించని రాళ్ల వర్షంతో పోలీసులు అవాక్కయ్యారు. ఇరు పార్టీల కార్యకర్తలను శాంతింపజేసేందుకు ప్రయత్నంచినా పోలీసులకు సాధ్యం పడలేదు. దాంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పోలీసులు తమ లాఠీలకు పని చెప్పారు. ఈ క్రమంలో ఎదురెదురుగా వస్తున్న ఇరు పార్టీల అభ్యర్థులు తమ వాహనాలను దిగి వెళ్లిపోయారు. అయినా పరిస్థితి అదుపులోకి రాలేదు. పలు దఫాలుగా పోలీసులు ఇరు గ్రూపులపై లాఠీలు ఝులిపించి చెదరగొట్టారు. అయినా కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. గంట సేపు రాళ్ల వర్షం కురుస్తూనే ఉంది. గాయాలపాలైన ఇరు పార్టీల కార్యకర్తలను ఆస్పత్రులకు తరలించారు. రాచకొండ పోలీసు అడిషనల్ కమిషనర్ దగ్గరుండి పరిస్థితి చక్కదిద్దారు. గాయాలపాలైన పోలీసులను రాచకొండ పోలీస్ కమిషనర్ చౌహాన్ పరామర్శించారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి పోటీలో ఉన్నారు. ఇద్దరు అభ్యర్థులు ఒకేరోజు.. ఒకేసారి నామినేషన్ వేసేందుకు తమ అనుచరులతో ప్లాన్ చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున కార్యకర్తలతో తరలివచ్చారు. బిఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి.. శాస్త్రా గార్డెన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అంబేద్కర్ చౌరస్తా నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వస్తున్నారు. దాంతో ఎటు చూసినా రెండు కిలో మీటర్ల మేరకు నాగార్జున సాగర్ రహదారి స్తంభించింది. ఇరు పార్టీల ర్యాలీలు తారసపడిన వెంటనే బిఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాల హోరెత్తించారు. ఇరువురూ రెచ్చిపోయారు. ఒకరిపై ఒకరు రాళ్లదాడి చేసుకున్నారు. క్షణాల్లోనే ఆ ప్రాంతం రణరంగంగా మారింది. దాంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఇండ్ల మధ్యకు పారిపోయిన కార్యకర్తలు మళ్లీమళ్లీ రాళ్లు రువ్వుకున్నారు. దాంతో పోలీసులు దఫదఫాలుగా లాఠీలకు పని చెప్పారు. ప్రత్యేక పోలీసు బలగాలను తెప్పించారు. సుమారు రెండు గంటల సేపు యుద్ధ వాతావరణం నెలకొంది. డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులకు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. నామినేషన్ సందర్భంగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఒకేసారి భారీ ర్యాలీలకు అనుమతించడం వల్లనే ఈ పరిస్థితికి దారితీసింది.

ర్యాలీగా వెళ్తున్న సమయంలో ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు రాళ్ల దాడికి దిగారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ జెండా కర్రలతో కాంగ్రెస్ నేతలపై, కాంగ్రెస్ జెండాల కర్రలతో బీఆర్ఎస్ నేతలపై విసురుకున్నారు. ఈ దాడిలో ఇరు పార్టీలకు చెందిన సుమారు 100 మంది తీవ్రంగా గాయపడ్డారు. దాంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి మల్ రెడ్డి రంగారెడ్డి వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. బీఆర్ఎస్ ప్రచార రథం సైతం పూర్తిగా ధ్వంసమైంది. వెంటనే మల్‌రెడ్డి రంగారెడ్డి వాహనం దిగి నామినేషన్ కోసం రిటర్నింగ్ కార్యాలయం లోపలికి వెళ్లిపోయారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సైతం తమ వాహనాన్ని దిగి ఎన్నికల కార్యాలయంలో తలదాచుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు ఇరు పార్టీ గ్రూపుల కార్యకర్తలపై లాఠీచార్జీ చేసి పరిస్థితి అదుపు చేసేందుకు యత్నించారు. ఎల్‌బీనగర్ డిసిపి శ్రీబాల చేతికి గాయమైంది. తలలు పగిలి, గాయాలపాలైన వారందరూ ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాచకొండ పోలీస్ కమిషనర్ చౌహాన్ వారిని పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు.

నిర్వహణా లోపంతో ప్రాజెక్టులు ఖాళీ

- తాగునీటికి కటకట తప్పదా!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాగార్జున సాగర్

ఎల్‌నినో ప్రభావంతో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు వుంటాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలను రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రమూ పరిగణలోకి తీసుకోకపోవడంతో ప్రధాన ప్రాజెక్టులు అడుగంటుతున్నాయి. తాగునీటికీ కటకట ఏర్పడే పరిస్థితి ఏర్పడింది. వర్షాభావ పరిస్థితులతో ప్రాజెక్టుల్లోకి వచ్చిందే తక్కువ నీరు కాగా, ఆ నీటిని ముందుచూపుతో నీటి వినియోగాన్ని పాటించకపోవడంతో వేసవి రాకముందే ప్రాజెక్టులన్నీ డెడ్ స్టోరేజీకి చేరువగా ఉన్నాయి. కీలకమైన కృష్ణానది నుండి గత ఏడాది 1,302 టిఎంసిలు సముద్రంలోకి పోగా, ఈ ఏడాది 62 టిఎంసిలు దిగువకు వెళ్లాయి. గోదావరి నది నుండి గత ఏడాది 6,196 టిఎంసిల నీరు సముద్రంలోకి పోగా ఈ ఏడాది 2,794 టిఎంసిలు వెళ్లాయి. కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార బేసిన్ల కింద దాదాపు 820.75 టిఎంసిల నిల్వ సామర్థ్యం వుంటే ఇప్పుడు 313 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ప్రస్తుతం ఎక్కువ ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో వున్న 313 టిఎంసిల నీటిని కూడా వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. కనీసం 40 శాతం నిల్వలు కూడా లేని పరిస్థితి ఏర్పడింది. శ్రీశైలం రిజర్వాయర్లో 215 టిఎంసిలకు గాను 63.3 టిఎంసిలు మాత్రమే వుంది. ప్రస్తుతం శ్రీశైలం నుండి తెలంగాణా కల్వకుర్తి ప్రాజెక్టు కోసం 2,400 క్యూసెక్కులు తీసుకుంటుండగా, రాష్ట్రంలో కెసి కెనాల్‌కు 490 క్యూసెక్కులు, హంద్రీనీవాకు 1350 క్యూసెక్కులు తీసుకుంటున్నారు. ఈ లెక్కన తీసుకుంటే శ్రీశైలంలో వున్న కొద్దిపాటి నీటి నిల్వలు నెలరోజులు కూడా వచ్చే పరిస్థితి లేదు. అదే జరిగితే వేసవిలో తాగునీటి అవసరాల తీర్చడం గగనమవుతుంది. నాగార్జున సాగర్ ప్రస్తుతం 157 టిఎంసిలతో డెడ్ స్టోరేజీకి చేరువగా ఉంది. నాగార్జునసాగర్ నుండి ప్రస్తుతం 3650 క్యూసెక్కులను కెనాల్స్‌కు వదులుతున్నారు. మొత్తంగా సాగర్‌లో మరో 20 టిఎంసిల నీరు మాత్రమే వినియోగించుకునే పరిస్థితి వుంది. ప్రకాశం బ్యారేజీ నుండి కృష్ణాడెల్టాకు పట్టిసీమ నుండి నీటిని తీసుకునే అవకాశం వున్నా ప్రభుత్వం ఆ వైపుగా ప్రయత్నాలు చేయకుండా పులిచింతలలో వున్న నీటిని వినియోగించారు. పట్టిసీమ నుండి సగటున ఏటా 80 టిఎంసిలకుపైగా నీటిని వినియోగించుకునే అవకాశమున్నా ప్రభుత్వం 50 టిఎంసిలను మాత్రమే ఈ ఏడాది వాడుకుంది. పులిచింతలలో 15.14 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వేసవిలో తాగేందుకు కూడా నీటిని వాడుకోలేని పరిస్థితిని ప్రభుత్వమే సృష్టించింది. వంశధార బేసిన్‌లో గత ఏడాది 122 టిఎంసిల నీటి లభ్యత వుంటే ఈ ఏడాది 49.12 టిఎంసిలు మాత్రమే వుంది. పెన్నా బేసిన్‌లో సోమశిల ప్రాజెక్టులో 78 టిఎంసిల పూర్తిస్థాయి సామర్థ్యానికి గాను గతేడాది 69 టిఎంసిలుంటే, ప్రస్తుతం 29.8 టిఎంసిలు మాత్రమే వున్నాయి. కండలేరులో 11.54 టిఎంసిలు వున్నాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో ప్రాజెక్టుల్లోకి వచ్చే వరద చాలా తక్కువ వుంటుందని హెచ్చరికలున్నా ప్రాజెక్టుల్లో ఆగస్ట్ దాకా వచ్చిన నీటిని వచ్చినట్లు విద్యుత్ ఉత్పత్తి కోసం దిగువకు వదిలేశారు. దీని ఫలితంగా వేసవిలో గుక్కెడు నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

వ్యాపార బాటలో రైల్వే

- భద్రత మరిచిన కేంద్రం
- 'రైలు ప్రమాదాలు - భద్రత' సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

గతంలో ప్రజా సేవే పరమావధిగా రైల్వే పనిచేసేదని, నేడు పాలకుల తీరుతో వ్యాపార బాటలో పయనిస్తోందని వక్తలు అన్నారు. వరుసగా జరుగుతున్న రైలు ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. 'రైలు ప్రమాదాలు - భద్రత' అన్న అంశంపై ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా కంచరపాలెంలోని బొట్టా నర్సింగరావు భవన్‌లో గురువారం సదస్సు జరిగింది. ప్రధాన వక్తగా ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెసి.జేమ్స్ పాల్గొని మాట్లాడుతూ.. రైల్వే ప్రమాదాలపై జరిగిన జ్యుడిషియల్ నివేదికలో, రైల్వే శాఖాపరమైన విచారణలో నిజమైన కారణాలు బయటకు రావడంలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ విచారణల్లో ఎప్పుడూ ఉద్యోగులే బలవుతున్నారన్నారు. బడ్జెట్‌లో రైల్వే భద్రతకు సరిగా నిధులు కేటాయించకపోవడంతోనే ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే లైన్లు సురక్షితం కావన్నారు. కేంద్ర ప్రభుత్వం తమకు కావలసిన ప్రాంతాల్లో మాత్రమే మెరుగైన రైల్వే లైన్లు వేస్తోందని తెలిపారు. ప్రతి ఏడాది రైళ్ల సంఖ్య పెరుగుతున్నా అందుకు తగ్గట్టు ఉద్యోగాల నియామకాలు జరగడం లేదన్నారు. పని ఒత్తిళ్లతో రైల్వే అధికారుల మధ్య సమన్వయ లోపం పెరుగుతోందని తెలిపారు. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాల వల్ల పలు సందర్భాల్లో లోకో పైలట్లు కూడా అయోమయానికి గురవుతున్నారని, ఈ కారణంతోనే ప్రస్తుతం డివిజన్‌లో ప్రతిరోజూ 25 నుండి 30 రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని తెలిపారు. గతేడాది సేఫ్టీ డైరెక్టర్ ఇచ్చిన నివేదిక ప్రకారం మన దేశంలో 40 శాతం రైళ్లను వాటి లైఫ్ టైం దాటిపోయినా ఉపయోగిస్తున్నారని తేలిందన్నారు. రైల్వే వ్యవస్థను పటిష్టం చేసేందుకు పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ రైల్వేల్లోని యూనియన్లను బలహీనం చేసే కుట్రలకు పాలకులు తెగబడుతున్నారన్నారు. రైల్వేను అదానీ, అంబానీలకు అప్పగించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని తెలిపారు.

రైల్వేను, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకునేందుకు ఐక్య పోరాటాలు చేయాలని కోరారు. సదస్సులో ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ జోనల్ ప్రెసిడెంట్ ఎస్‌కె చౌబే, సెక్రటరీ బోలేనాథ్, వాల్తేర్ సెంటర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బివిఎస్‌వి.రాజు, సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ రెడ్డి వెంకటరావు, పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయీస్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కెఎం.శ్రీనివాస్, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జేమ్స్, వేదికపై నర్సింగరావు తదితరులు

కలిసే ముందుకు

(మొదటి పేజీ తరువాయి)

కల్యాణ్ కలిసి ప్రసంగిస్తారని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలను చైతన్యం చేసేందుకు సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసిపి చిత్తుగా ఓడుతుందని, అందుకే టిడిపి - జనసేన నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిశచట్టం లేకుండానే యాప్ పేరుతో బలవంతంగా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఇక నుంచి 15 రోజులకోసారి ఉమ్మడి సమావేశం నిర్వహిస్తామన్నారు.

ఈ సమావేశంలో టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, నిమ్మల రామానాయుడు, పితాని సత్యనారాయణ, నాయకులు పయ్యావుల కేశవ్, తంగిరాల సౌమ్య, జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, నాయకులు కందుల దుర్గేష్, డి మహేందర్ రెడ్డి, కె గోవిందరావు, యశస్వి, బి నాయకర్ పాల్గొన్నారు.

బిజెపి మాతో కలవదనుకోవడం ఊహాజనితం : మనోహర్

రాష్ట్రంలో తాము టిడిపితో ఉంటే బిజెపి కలిసిరాదనుకోవడం ఊహాజనితమని, ఎన్నికల్లో ఉమ్మడిగానే కలిసి పోటీ చేసే అవకాశం ఉందని జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విలేకరులకు తెలిపారు.

బిజెపి తమతో కలిసి రాదని తాము అనుకోవడం లేదని పేర్కొన్నారు. తెలంగాణలో కలిసి పోటీచేస్తున్నామని, ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్నామని తెలిపారు.

గుంటూరులో సిపిఎం ఆద్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇజ్రాయిల్‌కు మోడీ మద్దతు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

నడుపుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, పరిశ్రమలు రావాలంటే కేంద్రం ప్రత్యేక హోదా ఇవ్వాలని, అందుకు కేంద్రం నుంచి సానుకూల స్పందన లేదన్నారు. రాష్ట్రానికి తీవ్ర హానిచేస్తున్న బిజెపిని వ్యతిరేకించవలసిందిపోయి వైసిపితో పాటు ప్రతిపక్ష టిడిపి, జనసేన కూడా కేంద్రాన్ని సమర్థించడం దారుణమని అన్నారు. బిజెపి విషకౌగిలిని వీడాలని ఆ పార్టీలకు గఫూర్ పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబూరావు, వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి, కె.ఉమామహేశ్వరరావు, దయారమాదేవి, శివనాగరాణి, భాస్కరయ్య, జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ దళారులకు ప్రజాపోరాటాలకు మధ్య పోటీ

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాలుగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ శాసనసభలో కమ్యూనిస్టులు లేని లోపం కనిపిస్తుందని తెలిపారు. శాసనసభ ప్రజావేదికగా కాకుండా బూతుల వేదికగా మారిందని విమర్శించారు. బిజెపికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్న ప్రతి ఒక్కర్నీ ఆహ్వానించేలా తమ పార్టీ విధానాన్ని రూపొందించుకున్నామన్నారు. కేరళలో కాంగ్రెస్, బెంగాల్‌లో తృణమూల్‌తో తగాదాలున్నా బిజెపిని ఓడించేందుకు సహకరిస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తే సమస్త హక్కుల కోసం పోరాడే వాణిగా ఉంటామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. బహిరంగ సభ అనంతరం భారీ ప్రదర్శనగా వెళ్లి ఖమ్మం రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో తమ్మినేని నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు ఖమ్మం అభ్యర్థిగా యర్రా శ్రీకాంత్ నామినేషన్ వేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ఖమ్మం, వైరా, సత్తుపల్లి అభ్యర్థులు యర్రా శ్రీకాంత్, భూక్యా వీరభద్రం, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్, వై.విక్రమ్, బుగ్గవీటి సరళ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ పేరుతో ద్రోహం

- దేశ భక్తి ముసుగులో సంపద లూటీ
- భారతీయుల వ్యక్తిత్వాన్ని అమెరికాకు తాకట్టుపెట్టిన మోడీ
- ప్రజారక్షణభేరి యాత్రలో వక్తలు

గుడివాడలో జరిగిన సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆత్మ నిర్భర్ పేరుతో దేశానికి బిజెపి ద్రోహం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం విమర్శించారు. దేశభక్తి అంటూ భారతీయుల వ్యక్తిత్వాన్ని, అంతరాత్మను అమెరికాకు మోడీ తాకట్టుపెడుతున్నారని ఆరోపించారు. ప్రతిరోజూ దేశభక్తి జపం చేస్తూ దేశ సంపద, వనరులను కార్పొరేట్లకు అప్పగిస్తోందని విమర్శించారు. సిపిఎం ప్రజారక్షణభేరి గురువారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, ఉండి, ఆకివీడు, ఏలూరు జిల్లా కలిదిండి మీదుగా కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది. ఆకివీడులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణాలో గుడివాడ, మచిలీపట్నంలో యాత్ర కొనసాగింది. ఆయా ప్రాంతాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. యాత్ర బృందానికి గుడివాడలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం, పంచాయతీ, మున్సిపల్, భవన నిర్మాణ కార్మికులు, కృష్ణా డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఆటో మొబైల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.

ఆయా చోట్ల జరిగిన బహిరంగ సభల్లో వక్తలు మాట్లాడుతూ.. దేశభక్తి ఉన్న వారెవరైనా ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షిస్తారని, కానీ మోడీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ వాటిని ప్రైవేటీకరిస్తోందని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పైప్‌లైన్ వేసి గ్యాస్‌ను తక్కువ ధరకు ఇస్తానని వాగ్దానం చేశారని, కానీ ఆ గ్యాస్ నేడు గుజరాత్ రాష్ట్రానికి వెళ్లిపోవడంతో సిలిండర్ ధర రూ.వెయ్యి అయ్యిందని తెలిపారు. మన ప్రాంతంలో ఉత్పత్తి అవుతున్న గ్యాస్‌ను ఇక్కడ రూ.400లకే ఇవ్వొచ్చన్నారు. సముద్ర తీరాన్ని అదానీపరం చేసే కుట్ర కొనసాగుతోందన్నారు. ఇటీవల జరిగిన అదానీ, ముఖ్యమంత్రి భేటీ వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. మోడీకి టిడిపి, వైసిపి, జనసేన దాసోహమంటున్నాయన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసిన ప్రధాని మోడీ ఒక్క దానిని కూడా అమలు చేయలేదన్నారు. మోడీ పాలనలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మణిపూర్‌లో మహిళలను వివస్త్రలుగా ఊరేగించినా ప్రధానికి పట్టలేదని విమర్శించారు. శ్రామిక మహిళల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులు ఇలా ఏ ఒక్కటీ మోడీ సర్కార్ ఇవ్వలేదన్నారు. ప్రశ్నించాల్సిన జగన్ రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి సాగిలపడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు మాట్లాడుతూ.. గిట్టుబాటు ధరలు అందక రైతులు ఒకపక్క నష్టపోతుంటే నిత్యావసరాల ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయన్నారు. రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పులివెందుల ఆదర్శం

- సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

శ్రీకృష్ణ దేవాలయాన్ని ప్రారంభించిన సిఎం, తదితరులు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్/రూరల్/రాయచోటి

అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనంగా తీర్చిదిద్దిన పులివెందుల పట్టణం దేశానికే ఆదర్శనీయమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం ఆయన కడప, అన్నమయ్య జిల్లాల్లో పర్యటించారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో రూ.64.54 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ముందుగా అన్నమయ్య జిల్లా రాయచోటిలో శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్నారు. నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. భాకరాపురం వద్ద రూ.4.54 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ దేవాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి పులివెందులకు చేరుకున్నారు. ఎపి కార్ల్‌లో రూ.9.96 కోట్లతో నిర్మించిన అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ కాలేజీ, రూ.11 కోట్లతో నిర్మించిన స్టేట్ ఆఫ్ ఆర్ట్ సెంట్రల్ టెస్టింగ్ లాబొరేటరీ, రూ.14.04 కోట్లతో నిర్మించిన శిల్పారామాన్ని ప్రారంభించారు. రూ.60 కోట్లతో నిర్మించనున్న శ్రీ స్వామి నారాయణ గురుకుల పాఠశాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆదిత్య బిర్లా యూనిట్‌ను సందర్శించారు. పులివెందులలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం సాయంత్రం 5.50 గంటలకు ఇడుపులపాయ ఎస్టేట్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బస చేశారు. కార్యక్రమంలో మంత్రులు ఆదిమూలపు సురేష్, కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కడప, రాజంపేట ఎంపిలు వైఎస్.అవినాష్‌రెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ షుగర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (లిక్విడేషన్ లో)
24 నవంబర్, 2023 శుక్రవారం నాడు మ.3.00 గంటల నుండి సా.5.00 గంటల వరకు నిర్వహించబడే ఇ-వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి వ్యక్తీకరణను (ఇఓఐ) సమర్పించడానికి సమయం పొడిగింపు

ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 కింద ఇ-వేలం కోసం విక్రయ ప్రకటన 23.10.2023న ప్రచురించబడింది. **గోయింగ్ కన్‌సర్న్‌గా కంపెనీ/ కార్పొరేట్ డేటార్‌ను కొనుగోలు చేసే ఎంపికతో తమిళనాడులోని తిరునెల్‌వెల్లి జిల్లా అంబసముద్రంలోని ముక్కూడల్ గ్రామంలోఉన్న అంబసముద్రం యూనిట్ భూమి (సుమారు 202 ఎకరాల విస్తీర్ణం) మరియు భవనాలను విక్రయించడానికి** 6 నవంబర్ 2023 నాటికి ఆసక్తి వ్యక్తీకరణను ఆహ్వానించబడినది. **ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించడానికి** చివరి తేదీ, ఇప్పుడు **14 నవంబర్, 2023** వరకు పొడిగించబడింది. వెబ్‌సైట్: www.psri.in/escl/ లో వివరించిన విధంగా అర్హత ప్రమాణాలను పూర్తి చేసిన దరఖాస్తుదారులు ఇప్పుడు ఆసక్తిని 14 నవంబర్ 2023లోపు సమర్పించవచ్చు. మీరు ip.empee@gmail.com / plan@psri.in లో అవసరాల కోసం ఇమెయిల్ చేయవచ్చు లేదా కాల్‌చేయవచ్చు సంప్రదించండి **91-98450 02523. 24 నవంబర్ 2023న నిర్వహించబడే ఇ-వేలం తేదీలో ఎటువంటి మార్పు లేదు.** EoI సమర్పించడానికి సమయం పొడిగింపు వివరాలు: www.psri.in/escl/ నందు ఉన్నాయి. .

తేదీ: శుక్రవారం, 9 నవంబర్ 2023
ప్రదేశం: బెంగళూరు

సం/-
పంకజ్ శ్రీవాస్తవ
శుక్రవారం, 9 నవంబర్ 2023
లిక్విడేటర్-ఎంపీ షుగర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్
బెంగళూరు
ఆఫీస్ నెం.58, 3వ క్రాస్, వినాయక్ నగర్, హెబ్బాల్, బెంగళూరు-560024
Regn No: IBBI/IPA-001/IP-P00245 /2017-18/10474
ఏఎఫ్ఏ 23/11/2023 వరకు చెల్లుబాటు అవుతుంది
Ph:080 2390 2344| ip.empee@gmail.com | psri@live.com | www.psri.in/escl

టిడిపి నేత బొజ్జలకు ఊరట

- 41(ఎ) నిబంధన అమలు చేయాలని హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

శ్రీకాళహస్తి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డికి హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయనతోపాటు మరో పాతికమంది టిడిపి కార్యకర్తలపై నమోదైన కేసులో పోలీసులు సిఆర్‌పిసి సెక్షన్ 41(ఎ) నిబంధన అమలు చేయాలంది. ఈ మేరకు శ్రీకాళహస్తి టూటౌన్ పోలీసులకు ఆదేశాలిచ్చింది. ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కేసు నమోదైనప్పటికీ, పిటిషనర్లపై నమోదైన కేసులో అభియోగాలు తీవ్రమైనవి కానందున సుప్రీంకోర్టు అర్నేష్‌కుమార్ కేసులో జారీ చేసిన నిబంధనను అమలు చేయాలని జస్టిస్ టి మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాళహస్తి రూరల్ సిఐ అజయకుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బొజ్జల సుధీర్‌రెడ్డితోపాటు ఇతరులపై రెండో పట్టణ పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి చట్టంతోపాటు ఇతర ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని దాఖలు చేసిన పిటిషన్‌లో పైవిధంగా తీర్పు వెలువడింది.

మద్యం కేసులో ముందస్తు బెయిల్ కోరిన కొల్లు

- సిఐడికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కంపెనీలకు అక్రమ అనుమతులు మంజూరు చేశారనే అభియోగాలతో సిఐడి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర దాఖలు చేసిన వ్యాజ్యాన్ని గురువారం హైకోర్టు విచారణ జరిపింది. కౌంటర్ దాఖలు చేయాలని సిఐడిని ఆదేశించింది. విచారణను ఈ నెల 15కు వాయిదా వేస్తూ జస్టిస్ టి మల్లికార్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రంలోని రెండు బ్రేవరీస్, మూడు డిస్టిలరీలకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకోవడంతో ప్రభుత్వానికి ఆర్థికంగా తీవ్ర నష్టం కలిగిందంటూ రాష్ట్ర బ్రేవరీస్ ఎమ్‌డి డి వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐడి కేసు నమోదు చేసింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న కొల్లు రవీంద్రకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు కోరారు. కౌంటర్ దాఖలుకు గడువు కావాలని సిఐడి తరపున న్యాయవాది శివకల్పనారెడ్డి కోరారు.

సైనికునిపై దాడి కేసులో నలుగురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనకాపల్లి జిల్లా పరవాడ సంతబయలులో ప్రజలు చూస్తుండగా ఆర్మీ జవాన్ అలీముల్లాపై దాడి చేసిన కేసులో నలుగురు కానిస్టేబుళ్లు సస్పెండయ్యారు. ఈ మేరకు కానిస్టేబుళ్లు ఎ దేవుళ్లు, బి శోభ, ఎం ముత్యాల నాయుడు, పి రమేష్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని రేంజ్ డిఐజి పి హరికృష్ణను డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఆదేశించారు. జమ్ముకాశ్మీర్‌లో విధులు నిర్వహించే జవాన్ అలీముల్లా సెలవుపై సొంతూరుకు వెళ్లేందుకు పరవాడ సంతలో వేచివుండగా, దిశ యాప్ డౌన్ లోడ్ విషయంలో ఆయనపై నలుగురు కానిస్టేబుళ్లు దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డారు. జవాన్‌పై దాడి చేయడమే కాకుండా అక్కడ వున్న స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. 'పోలీసులు ప్రజలకు రక్షణగా నిలవాలి. కానీ, వారిపై దాడి చేయడం క్షమించరాని నేరం. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎసిబి వలలో చుండూరు పోలీసులు

ఎస్ఐ, రైటర్, కానిస్టేబుల్‌పై కేసు

ప్రజాశక్తి-చుండూరు (బాపట్ల జిల్లా)

రూ.40 వేలు లంచం తీసుకుంటూ.. చుండూరు ఎస్ఐ, రైటర్, కానిస్టేబుల్ ఎసిబికి పట్టుబడ్డారు. ఎసిబి అడిషనల్ ఎస్‌పి మహేంద్ర మత్తే తెలిపిన వివరాల ప్రకారం.. చుండూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన బత్తుల గోవిందుకు చెందిన స్థలంలో ఈ ఏడాది అక్టోబర్ ఏడున రెవెన్యూ అధికారులు కంపోస్టు యార్డు ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేశారు. ఈ స్థలంలో ఏర్పాటు చేయడానికి వీలులేదని గోవిందు అడ్డుపడ్డారు. విధులకు ఆటంకం కలిగించారనే నెపంతో చుండూరు తహాశీల్దార్ సూచన మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ నాగమల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చుండూరు పోలీస్‌స్టేషన్‌లో అతనిపై కేసు నమోదు చేశారు. గోవిందుకు చెందిన స్కార్పియో వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కారును విడిపించడానికి, అరెస్టు చేయకుండా ఉండేందుకు పోలీసులు లంచం డిమాండ్ చేశారు. రూ.75 వేలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో రూ.30 వేలు ఫోన్ పే ద్వారా తొలుత చెల్లించారు. మిగతా రూ.45 వేలు ఇచ్చేందుకు ఇష్టపడని గోవిందు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు డబ్బులు ఇచ్చేందుకు గోవింద్ స్టేషన్‌కు వెళ్లగా ఎస్ఐ భరత్‌కుమార్ అందుబాటులో లేరు. రైటర్ రవీంద్రకు డబ్బులు ఇస్తుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఇందులో ఎస్ఐ, కానిస్టేబుల్ క్రాంతి ప్రమేయం ఉందని రైటర్ చెప్పడంతో వారిని కూడా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

ప్రైవేటు స్కూలు విద్యార్థులకు రక్తహీనత గుర్తించే పరీక్షలు

అధికారులకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అన్ని ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు రక్తహీనత గుర్తింపు పరీక్షలు చేయాలని అధికారులను సిఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై వైద్యారోగ్య, మహిళా, శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖల ఉన్నతాధికారులతో సిఎస్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్త పరీక్షలను డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలని అన్ని పాఠశాలల యాజమాన్యాలకు ఆదేశాలు ఇవ్వాలని విద్యాశాఖ కమిషనరు సురేష్‌కుమార్‌కు సూచించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రక్త పరీక్షలు పూర్తి చేశారని, వారికి ఇచ్చిన విధంగానూ ప్రైవేటు స్కూలు పిల్లలకు ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత పౌష్టికాహారలోప నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ ప్రెగ్నెంట్ మహిళల వివరాలు దగ్గర పెట్టుకుని ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. కౌమారదశ బాలికల్లోనూ రక్తహీనత నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతినెలా మొదటి, మూడో శుక్రవారాల్లో విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్‌డేను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. బాల్య వివాహాల నియంత్రణపైనా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో హెల్త్ బేబీషోలు నిర్వహించాలన్నారు. వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎమ్‌టి కృష్ణబాబు వైద్యారోగ్యశాఖకు సంబంధించి వివిధ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను వివరించారు. మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి మాట్లాడుతూ.. పెరుగుదల సరిగ్గాలేని పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐరన్ ఫోలిక్ సిరప్, టేక్‌హోం రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో అధికారులు జె నివాస్, దివాన్ మైదీన్, భావన, జానకి, గిరిజాశంకర్, కె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవి రమణారెడ్డి థర్మల్ పవర్ ప్లాంటుగా మార్పు

- ఆర్‌టిపిపి పేరు మారుస్తూ జిఓ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప జిల్లాలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటు (ఆర్‌టిపిపి) పేరును రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. మాజీ ఎమ్మెల్యే ఎంవిఆర్ పేరును ప్లాంటుకు పెడుతూ జిఓ 24ను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ గురువారం విడుదల చేశారు. ఇక నుంచి ఎంవిఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా పేరు ఉంటుందని పేర్కొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత డేవిడ్ కన్నుమూత

డేవిడ్

ప్రజాశక్తి - విజయవాడ/ అమరావతి బ్యూరో

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర ప్రధాన కార్యదర్శి మన్నం డేవిడ్ (66) గురువారం తీవ్ర అనారోగ్యంతో కన్నుమూశారు. సింగ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆయన గత కొన్నేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తన ముగ్గురు కుమార్తెలకు ఉద్యమ నేతలైన ఐలమ్మ, స్వరాజ్యం, ఉదయం పేర్లు పెట్టారు. డేవిడ్ భార్య బుజ్జమ్మ కండ్రిక ప్రాంతంలో మున్సిపల్ కార్మికురాలిగా పని చేస్తున్నారు. డేవిడ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులుగా, జిల్లా అధ్యక్షులుగా ఉన్నారు. 1983లో సిపిఎం సభ్యుడిగా చేరిన ఆయన 2014 నుంచి విజయవాడ సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులుగా, పార్టీ పూర్తికాలం కార్యకర్తగా పని చేశారు. 1998లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మలేరియా విభాగంలో వర్కర్‌గా చేరారు. అనంతరం యూనియన్ బాధ్యతలు చూస్తూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై అవిశ్రాంతంగా పోరాడారు.

పలువురు సంతాపం

డేవిడ్ మృతి ఉద్యమానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఆయన మృతికి సంతాపంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మస్టర్ పాయింట్లలో సంతాపం వ్యక్తం చేయాలని ఉమామహేశ్వరరావు సూచించారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి
2వ అంతస్తు, టిఎస్ఆర్‌టిసి బిల్డింగ్, కమ్యూనిటీ అమెనిటీ సెంటర్, కోఠి, హైదరాబాద్-500 095, టెలిఫోన్స్: 040-24651352, ఇ-మెయిల్: sbi.05172@sbi.co.in

దిన పత్రికలో ప్రచురించుటకు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసులోని విషయాల నఖలు దానిని వాపసు పంపబడినది మరియు అందజేయబడలేదు.

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ రుణగ్రహీతలు/ హామీదారులు 1) శ్రీ మరిగంటి వెంకట కృష్ణ మోహన్, తండ్రి శ్రీ అప్పల మరిగంటి, 2) శ్రీ దొడ్డ ముత్యం తండ్రి శ్రీ ఆనందయ్య దొడ్డ, 3) శ్రీ కోమినేని విద్యాసాగర్, తండ్రి శ్రీ నారాయణ, 4) శ్రీ అక్కినపల్లి వెంకటప్ప చార్యులు, తండ్రి శ్రీ సీతారామయ్య, 5) శ్రీ కొల్లి వెంకట రవి కుమార్, తండ్రి కొల్లి కృష్ణ మూర్తి, 6) శ్రీమతి కొల్లి భాస్కర జ్యోతి, భర్త శ్రీ కొల్లి వెంకట రవి కుమార్ మరియు 7) శ్రీ తాకెట్టపాటి వెంకట్‌దుర్గ ప్రసాద్, తండ్రి శ్రీ పూర్ణ చంద్ర రావు తక్కిలపాటి అనువారు బ్యాంకు నుండి వారు పొందిన రుణాల సదుపాయాలను అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్టి చెందినందున, రుణాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద వారు గతంలో తెలిపిన చిరునామా పై వారికి నోటీసుల జారీచేయబడినవి అవి రిటర్న్‌చేయబడినవి బట్వాడా కాలేదు మరియు ఇట్టి పరిస్థితుల్లో వారికి ఈ బహిరంగ ప్రకటన రూపేనా తెలియజేయబడుచున్నది.

రుణగ్రహీత పేరు	స్వాధీనంచేసుకున్న ఆస్తుల వివరాలు/సెక్యూర్డ్ అసెట్స్ చిరునామా	నోటీసు తేది	ఎన్‌పిఏ తేది	బకాయి మొత్తాలు (నోటీసు తేదీ నాటికి)
ది ప్రెసిడెంట్, మెసర్స్ శ్రీ వాణి ఎడ్యుకేషనల్ సొసైటీ, చెవుటూరు గ్రామపంచాయతీ, జి-కొండూరు మండలం, కృష్ణా జిల్లా, ఆం.ప్ర.-521299. శ్రీ దొడ్డ ముత్యం తండ్రి శ్రీ ఆనందయ్య దొడ్డ, ఇ.నం.2-28, కుప్పెనకుంట్ల, పెనుబల్లి మండలం, ఖమ్మం-507 302. శ్రీ అక్కినపల్లి వెంకటప్ప చార్యులు, తండ్రి శ్రీ సీతారామయ్య, ఇ.నం.17-173, అశోక్ నగర్, తిరువూరు-521235, కృష్ణా జిల్లా. శ్రీ కొల్లి వెంకట రవి కుమార్, తండ్రి కొల్లి కృష్ణ మూర్తి, ఇ.నం.7-66, ఫ్లాట్ నం.303, కిషోర్ ప్లాజా, నాచారం రోడ్, ఫ్యాక్టరీ సెంటర్ దగ్గర, హబ్సిగూడ, హైదరాబాద్-500 007. శ్రీ తాటెల్లపాటి వెంకట దుర్గ ప్రసాద్, తండ్రి శ్రీ పూర్ణ చంద్ర రావు తక్కిలపాటి, ఇ.నం.6-43/12, భాగ్య రేఖ రెసిడెన్సీ, దేవినేని వారి స్ట్రీట్, గొల్లపూడి, కృష్ణా జిల్లా, ఎ.పి.-521 225. శ్రీ డి. శ్రీనివాస రావు, ఇ.నం.7-54, జైహింద్ రైస్ మిల్ రోడ్, తిరువూరు, కృష్ణా జిల్లా-521235. శ్రీ సిహెచ్. మధు సూధన రావు, ఇ.నం.9-7-107, వార్డు నం.9, బ్లాక్ నం.7, కసబ బజార్, వల్లలవాణి వీధి, ఖమ్మం (అర్బన్), మండలం, ఖమ్మకం, శ్రీమతి కె. రత్న కుమారి, ఇ.నం.1-8-639/401, అలేఖ్య అపార్టుమెంట్స్, నల్లకుంట, హైదరాబాద్. శ్రీ మరిగంటి వెంకట కృష్ణ మోహన్, తండ్రి శ్రీ మరిగంటి అప్పల చారి, ఇ.నం.3-5-1083, నారాయణగూడ, కేశవ మెమోరియల్ హై స్కూల్, నారాయణగూడ, హిమాయత్ నగర్, హైదరాబాద్-500 029. శ్రీ పి. వెంకటేశ్వర రావు, తండ్రి శ్రీ విశ్వనాథం, డోర్ నం.1-85, కుప్పనేకుంట్ల గ్రామం, పునుబల్లి మండలం, ఖమ్మం-507305. శ్రీ జె. మురళి కృష్ణ, ఇ.నం.22-23, బైపాస్ రోడ్, నడిమి తిరువూరు, కృష్ణా జిల్లా-521 235. ఖశ్రీ ఇ. సుబ్రమణ్యేశ్వర రావు, ఇ.నం.17-173, అశోక్ నగర్, తిరువూరు-521 235. శ్రీ మరిగంటి వెంకట కృష్ణ మోహన్, తండ్రి శ్రీ అప్పల చారి మరిగంటి, ఇ.నం.3-5-1083, నారాయణగూడ, కేశవ మెమోరియల్ హై స్కూల్, నారాయణగూడ, హిమాయత్ నగర్, హైదరాబాద్-500 029. శ్రీ కోమినేని విద్యాసాగర్, తండ్రి శ్రీ నారాయణ, ఇ.నం.21-51, శాంతి నగర్, ఫ్యాక్టరీ సెంటర్ దగ్గర, తిరువూరు, కృష్ణా జిల్లా-521 235. శ్రీ కొల్లి వెంకట రవి కుమార్, తండ్రి కొల్లి కృష్ణ మూర్తి, డోర్ నం.2-17-54/1, శ్రీసాయి శాంతి నిలయం, కనకదుర్గ టెంపుల్ దగ్గర, ఎస్‌బిహెచ్ కాలనీ, ఉప్పల్, రంగారెడ్డి జిల్లా-500039. శ్రీమతి కొల్లి భాస్కర జ్యోతి, భర్త శ్రీ కొల్లి వెంకట రవి కుమార్, డోర్ నం.2-17-54/1, శ్రీసాయి శాంతి నిలయం, కనకదుర్గ టెంపుల్ దగ్గర, ఎస్‌బిహెచ్ కాలనీ, ఉప్పల్, రంగారెడ్డి జిల్లా-500039. శ్రీ కె. వేంకటేశ్వర రావు, ఇ.నం.15-78/1, విద్యానగర్, వార్డు నం.15, సత్తుపల్లి, ఖమ్మం. శ్రీ ఎం. ప్రభాకర్ రెడ్డి, ఇ.నం.16-198, నేతాజి రోడ్, అయ్యగారిపేట, వార్డు -9, సత్తుపల్లి, ఖమ్మం. శ్రీ కె. రాఘవేంద్ర రావు, ఇ.నం.7-31, రామాలయం స్ట్రీట్, ముస్తాబాద్ (పోస్టు), గన్నవరం, కృష్ణా జిల్లా. శ్రీ ఎన్.సత్యనారాయణ, ఇ.నం.4-1-54/2, వార్డు-1, జగదాంబ టాకీసు ఏరియా, యెల్లందు (మం), ఖమ్మం. శ్రీ పి. నాగేశ్వర రావు, మిల్లేనియం స్కూల్, సత్తుపల్లి పోస్టు మరియు మండలం, ఖమ్మం జిల్లా-507 303. శ్రీ జె. శివలింగ ప్రసాద్, తండ్రి సత్యనారాయణ, డోర్ నం.1-47, బైపాస్ రోడ్, తిరువూరు, కృష్ణా జిల్లా-521 235. శ్రీ సిహెచ్. కృష్ణయ్య, ఇ.నం.2-63, కల్పతారు రోడ్, అయ్యగారిపేట, సత్తుపల్లి, ఖమ్మం. శ్రీ ఎన్. శ్రీనివాస రావు, ఇ.నం.2-232/ఎ, కల్లూరు, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా-507 209.	**1) ది సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, మైలవరం** వారి కార్యాలయం వద్ద రిజిస్టరైన, రిజిస్టర్డు సేల్ డీడ్ డాక్యుమెంట్ నం.**4180/2008** ఆధారంగా **శ్రీ వాణి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధియైన దీని ప్రెసిడెంట్ శ్రీ కొల్లి వెంకట రవి కుమార్ తండ్రి శ్రీ కృష్ణమూర్తి** కి చెందిన మైలవరం సబ్-రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా, జి. కొండూరు మండలం, చెవుటూరు రెవెన్యూ గ్రామం వద్దగల ఆర్.ఎస్.నం.276/1లో విస్తీర్ణం ఎక.4-18సెంట్స్ లేదా 16915.86, ఆర్.ఎస్.నం.276/2లో ఎక.1-22సెంట్లు లేదా 4937.16చ.మీ.ల విస్తీర్ణం, ఆర్.ఎస్.నం.276/3లో ఎక.3-80సెంట్స్ లేదా 15378.10చ.మీ.ల విస్తీర్ణం, ఆర్.ఎస్.నం.276/4లో ఎక. 2-80సెంట్లు లేదా 11331.20చ.మీ.లు పూర్తి విస్తీర్ణం ఎక.12.00సెంట్లు లేదా 48562.30చ.మీ.లు గల విస్తీర్ణంపు ల్యాండ్ కలిగియున్న ఆస్తి యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** మెసర్స్ కొల్-ఆన్ మోటర్స్ లిమిటెడ్ ఆస్తి& వాగు, **దక్షిణం:** వాగు, **పడమర:** మెసర్స్ కోల్-ఆన్ మోటర్స్ లిమిటెడ్ ల్యాండ్, **ఉత్తరం:** వాగు. **2)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.290లోకి వచ్చు ఎక.3.18సెంట్లు లేదా 1.287హెక్టార్లు విస్తీర్ణంగల మెట్ట భూమి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: చత్రపతిపల్లి రాఘవులు ల్యాండ్, దక్షిణం: వాగు ల్యాండ్, పడమర: వాసు ల్యాండ్, ఉత్తరం: కంది వెంకట రెడ్డి ల్యాండ్. (శ్రీ కొల్లి వెంకట రవి కుమార్ & శ్రీ కిలారు వేంకటేశ్వర రావుకు చెందిన సేల్ డీడ్ నం.1528/2009, తేది: 18.6.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **3)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.279/1ఎలోకి వచ్చు ఎక.0.76సెంట్లు లేదా 0.313హెక్టార్లు విస్తీర్ణం ఆర్.ఎస్.నం.279/1సిలోకి వచ్చు ఎక.2.06సెంట్లు లేదా 0.833హెక్టార్లు రెండు ఐటెంల పూర్తి విస్తీర్ణం ఎక.2.82సెంట్లు గల మెట్ట భూమి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: కొప్పుల సంబిరెడ్డి& ఇతరుల ల్యాండ్, దక్షిణం: ఎర్రం సేత్ తిరుపతమ్మ ల్యాండ్, పడమర: బొర్రముక్కు అంజిరెడ్డి& ఇతరుల ల్యాండ్, ఉత్తరం: లెక్షి ల్యాండ్. ఈ సరిహద్దుల్లో విస్తీర్ణం ఎక.2.82సెంట్లు (శ్రీ దార శ్రీనివాస రావు & శ్రీ ఎం. ప్రభాకర రెడ్డికు చెందిన సేల్ డీడ్ నం.1529/2009, తేది: 18.6.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **4)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.280/1ఎలోకి వచ్చు ఎక.0.82సెంట్లు లేదా 0.329హెక్టార్లు విస్తీర్ణం ఆర్.ఎస్.నం.280/1సిలోకి వచ్చు ఎక.1.51సెంట్లు లేదా 0.612హెక్టార్లు రెండు ఐటెంల పూర్తి విస్తీర్ణం ఎక.2.33సెంట్లు గల మెట్ట భూమి యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: కంది వెంకట రెడ్డి ల్యాండ్, దక్షిణం: వాగు పొరంబోకు ల్యాండ్, పడమర: కొప్పుల సంబిరెడ్డి ల్యాండ్, ఉత్తరం: కంది సంబిరెడ్డి ల్యాండ్& బులి వెంకట రెడ్డి ల్యాండు. (శ్రీ చల్లా మధుసుధన్ రావు & శ్రీ దొడ్డ ముత్యం కు చెందిన సేల్ డీడ్ నం.1530/2009, తేది: 18.6.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **5)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.279/3లోకి వచ్చు ఎక.2.62సెంట్లు లేదా 1.059హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. సరిహద్దులు: తూర్పు: కంది కోటి రెడ్డి ల్యాండ్, దక్షిణం: వాగు ల్యాండ్, పడమర: మేక కృష్ణా రావు& ఇతరుల ల్యాండ్, ఉత్తరం: కాల్ ఆన్ మోటర్స్& కొప్పుల సంబిరెడ్డి ల్యాండ్. (శ్రీ కె. రాఘవేంద్ర రావు & శ్రీమతి కె. రత్నకుమారి కు చెందిన సేల్ డీడ్ నం.1531/2009, తేది: 18.6.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **6)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.281లోకి వచ్చు ఎక.3.03సెంట్లు లేదా 1.227హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భాగం. సరిహద్దులు: తూర్పు: షేక్ జమాల్ భాయి& ఇతరుల ల్యాండ్, దక్షిణం: కలవ కొల్లు జమాలయ్య& ఇతరుల ల్యాండ్, పడమర: లెక్షా ల్యాండ్, ఉత్తరం: వాగు ల్యాండ్. ఈ సరిహద్దుల్లో విస్తీర్ణం ఎక.3.03సెంట్లు. (శ్రీ ఎస్. సత్యనారాయణ & శ్రీ మరిగంటి వెంకట కృష్ణ మోహన్ కు చెందిన సేల్ డీడ్ నం.1532/2009, తేది: 18.6.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **7)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.284లోకి వచ్చు ఎక.4.32సెంట్లు లేదా 1.749హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. సరిహద్దులు: తూర్పు: వాగు, దక్షిణం: వాగు, పడమర: ఎక్షా ల్యాండ్, ఉత్తరం: వాగు. ఈ సరిహద్దుల్లో విస్తీర్ణం ఎక.4.32సెంట్లు (శ్రీ కొల్లి వెంకట రవి కుమార్,శ్రీ పసుమర్తి వేంకటేశ్వర రావు& శ్రీ పోట్రు నాగేశ్వర రావు కు చెందిన సేల్ డీడ్ నం.1533/2009, తేది: 18.6.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **8)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.281లోకి వచ్చు ఎక.3.03సెంట్లు లేదా 1.227హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. సరిహద్దులు: తూర్పు: ఎక్షా ల్యాండ్, దక్షిణం: కలవకొల్లు జమాలయ్య& ఇతరుల ల్యాండ్, పడమర: బొర్రముక్కు అంజి రెడ్డి ల్యాండ్, ఉత్తరం: వాగు. ఈ సరిహద్దుల్లో విస్తీర్ణం ఎక.3.03సెంట్లు (శ్రీ కొల్లి వెంకట రవి కుమార్,శ్రీ తక్కెలపాటి వెంకట కనక దుర్గ ప్రసాద్ కు చెందిన సేల్ డీడ్ నం.1534/2009, తేది: 18.6.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **9) ఐటెం నం.1:** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.275/1లోకి వచ్చు ఎక.6.10సెంట్లు లేదా 2.470హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. సరిహద్దులు: తూర్పు: మేక వెంకట కృష్ణా రావు ల్యాండ్, దక్షిణం: ఎక్షా ల్యాండ్, పడమర: మేక వెంకట కృష్ణా రావు ల్యాండ్, ఉత్తరం: మేక వెంకట కృష్ణారావు ల్యాండ్. **ఐటెం నం.2:** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.274లోకి వచ్చు ఎక.0.52సెంట్లు లేదా 202హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. సరిహద్దులు: తూర్పు: ఎక్షా ల్యాండ్, దక్షిణం: ఎక్షా ల్యాండ్, పడమర: గవిరినేని వెంకటేశ్వర రావు ల్యాండ్, ఉత్తరం: వాగు ల్యాండ్. **ఐటెం నం.3:** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.275/2లోకి వచ్చు ఎక.1.60సెంట్లు లేదా 0.648హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. సరిహద్దులు: తూర్పు: వాగు ల్యాండ్, దక్షిణం: కాటమనేని గోపాల రావు ల్యాండ్, పడమర: మేక రాకా కృష్ణ ల్యాండ్, ఉత్తరం: చింతపల్లి వేంకటేశ్వర రావు ల్యాండ్. ఈ మూడు ఐటెంల పూర్తి విస్తీర్ణం ఎక.8.20సెంట్లు (శ్రీ జంగాల శివలింగ ప్రసాద్, శ్రీ జంగాల మురళి కృష్ణ & శ్రీ చల్లాగుండ్ల కృష్ణయ్య కు చెందిన సేల్ డీడ్ నం.1535/2009, తేది: 18.6.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **10)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.272/2లోకి వచ్చు ఎక.3.08సెంట్లు లేదా 1.248హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. రెండు ఐటెంల పూర్తి విస్తీర్ణం ఎక.3.32సెంట్లు సరిహద్దులు: తూర్పు: మేక వెంకటాచలం ల్యాండ్, దక్షిణం: రుకా శ్రీరాములు ల్యాండ్, పడమర: పొగుగుల ఈశ్వర రావు& ఇతరుల ల్యాండ్, ఉత్తరం: శీలం పాపి రెడ్డి ల్యాండ్. (శ్రీమతి ముచ్చ భాస్కర జ్యోతి మరియు శ్రీ ఇ. సుబ్రమణ్యం కు చెందిన సేల్ డీడ్ నం.1536/2009, తేది: 18.6.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **11)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.77/3లోకి వచ్చు ఎక.1.18సెంట్లు లేదా 0.477హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. సరిహద్దులు: తూర్పు: శీలం పాపి రెడ్డి ల్యాండ్, దక్షిణం: చెవుటూరు సరిహద్దు, పడమర: శీలం వేంకటేశ్వర రెడ్డి ల్యాండ్, ఉత్తరం: వాగు పోరంబోకు.(శ్రీ ఎం. శ్రీనివాస రావు కు చెందిన సేల్ డీడ్ నం.1330/2009, తేది: 14.5.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **12)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.267/3లోకి వచ్చు ఎక.1.00సెంట్లు లేదా 0.405హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. సరిహద్దులు: తూర్పు: శీలం పాపి రెడ్డి ల్యాండ్, దక్షిణం: ముప్పిడి సీతారావమ్మ ల్యాండ్, పడమర: మట్టె కృష్ణవేణి మొ॥వారి ల్యాండ్, ఉత్తరం:సరిహద్దు డొంక.(శ్రీ ఎం. శ్రీనివాస రావు కు చెందిన సేల్ డీడ్ నం.1331/2009, తేది: 14.5.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **13)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.270/1లోకి వచ్చు ఎక.1.73సెంట్లు లేదా 0.700హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. సరిహద్దులు: తూర్పు: నర్సింహా మూర్తి ల్యాండ్, దక్షిణం: వనుకూరు వెంకట రెడ్డి ల్యాండ్, పడమర: బీషపు రమేశ్ బాబు ల్యాండ్, ఉత్తరం: కాలువ.(శ్రీ ఎం. శ్రీనివాస రావు కు చెందిన సేల్ డీడ్ నం.1332/2009, తేది: 14.5.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి) **14)** కృష్ణా జిల్లా పరిధుల్లో మైలవరం సబ్-రిజిస్ట్రార్ పరిధిలో జి. కొండూరు మండలం, చెవుటూరు గ్రామం& పంచాయతి యొక్క ఆర్.ఎస్.నం.270/1లోకి వచ్చు ఎక.1.73సెంట్లు లేదా 0.700హెక్టార్లు విస్తీర్ణం భూమి యొక్క మొత్తం మెట్ట భూమి భాగం. సరిహద్దులు: తూర్పు: బీషపు కిషోర్ ల్యాండ్, దక్షిణం: వనుకూరు వెంకట రెడ్డి ల్యాండ్, పడమర: బొబ్బూరి సీతమ్మ ల్యాండ్, ఉత్తరం: కాలువ.(శ్రీ ఎం. శ్రీనివాస రావు కు చెందిన సేల్ డీడ్ నం.1333/2009, తేది: 14.5.2009 క్రింద కవరుచేయబడిన ఆస్తి)	09-10-23	01-03-23	03.07.2023 నాటికి రూ. 1,60,15,653/- (రూపాయలు ఒక కోటి అరవై లక్షల పదిహేను వేల ఆరు వందల యాభై మూడు మాత్రమే), 04.07.2023 నుండి తదుపరి వడ్డీతో.

నోటీసు అందుటకుగాను తగిన చర్యలు తీసుకోబడినవి. పై రుణగ్రహీతలు మరియు/లేదా హామీదారులు (ఎక్కడైతే అవసరమో)ను ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజుల్లోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా ఇందుమూలంగా కోరబడుచున్నది. విఫలం చెందిన ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు తీసుకోబడుతాయి. **సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.**

తేది: 09.10.2023, ప్రదేశం: హైదరాబాద్ | **సం/- అధీకృత అధికారి, ఎస్‌బిఐ, ఎస్ఎఆర్‌బి, కోఠి, హైదరాబాద్.**

సంపాదకీయం

రాజ్‌భవన్ రాజ్ కారాదు

ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాష్ట్ర ప్రభుత్వాలను తమ పాలనా విధులను నిర్వర్తించనీయకుండా అడ్డుపడుతున్న గవర్నర్ల తీరును రాజ్యాంగపరంగా ఎదుర్కొనేందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవలసి రావడం బిజెపి పాలనలో భారత ఫెడరల్ వ్యవస్థకు పట్టిన దుర్గతిగా భావించవచ్చు. తమ రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను ఏళ్లతరబడి ఆమోదించకుండా నిలిపివేసిన గవర్నర్ల వైఖరిపై పంజాబ్, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. బిల్లులపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను ఆదేశించలేమన్న కేరళ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ బుధవారం ఆ రాష్ట్ర ప్రభుత్వం మరో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఆ పిటిషన్లన్నింటినీ సుప్రీం ధర్మాసనం శుక్రవారం (నేడు) విచారించనుంది. కేరళ అసెంబ్లీ ఆమోదించిన ఎనిమిది ముఖ్యమైన బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచారు. గవర్నర్ పరిశీలనకు పంపిన వాటిలో మూడు బిల్లులు ఇప్పటికే రెండేళ్లు పూర్తి కాగా మరో మూడు బిల్లులపై ఏడాదికి పైగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన 12 బిల్లులను ఆ రాష్ట్ర గవర్నర్ రవి ఆమోదం తెలపకుండా అడ్డుకున్నారు. పంజాబ్ గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ ఏడు బిల్లుల్ని పెండింగ్‌లో పెట్టారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్లు సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలి. ద్రవ్య బిల్లులు మినహా మిగతావాటిని నిలుపుదల (విత్‌హోల్డ్) చేయడం, లేదా రాష్ట్రపతికి పంపడం చేయవచ్చు. నిలుపుదల చేస్తే ఏవైనా సెక్షన్లను సవరించడం గురించి లేదా బిల్లు మొత్తాన్ని పున:పరిశీలించాలంటూ వీలైనంత త్వరగా శాసనసభకు పంపాలి. శాసన సభ అదే బిల్లును తిరిగి ఆమోదించి పంపితే గవర్నర్ తప్పక ఆమోదముద్ర వేయాలని ఈ ఆర్టికల్ స్పష్టంగా పేర్కొంది. అంటే ప్రజల చేత ఎన్నికైన శాసనసభ చేసిన బిల్లులను చట్ట రూపం దాల్చకుండా చేసే హక్కు, అధికారం గవర్నర్‌కు లేవని రాజ్యాంగం తేల్చి చెప్పింది. తెలంగాణ గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, ఆర్టికల్ 200ని ప్రస్తావించింది. 'సాధ్యమైనంత త్వరగా' అనేది రాజ్యాంగపరంగా చాలా ముఖ్యమైనదనీ, రాజ్యాంగబద్ధంగా ఉన్నవారు ఆ విషయాన్ని మరచిపోకూడదని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయం తెలిసిందే. బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో గవర్నర్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడం వల్ల శాసనసభకు, ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. రాజ్యాంగాన్ని ఉల్లంఘించే విధంగా వ్యవహరించే గవర్నర్లకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 రక్షణకు అర్హత లేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. పంజాబ్, కేరళ, తమిళనాడు ప్రభుత్వాల కేసు విచారణ సందర్భంగా గవర్నర్లు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు కారంటూ భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్య ఎంతో అర్ధవంతమైనది.

విపక్షాలకు చెందిన రాష్ట్ర ప్రభుత్వాలకు గవర్నర్ల ద్వారా అడ్డంకులు కల్పించి, పాలన సాగనీయకుండా చేయడం బిజెపి ప్రభుత్వ దుర్నీతి. రాజ్‌భవన్ ద్వారా రాజకీయాలు నడిపే విధానాలను బిజెపి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. ప్రజలెన్నుకున్న శాసనసభ ఆమోదించిన బిల్లులకు మోకాలొడ్డి, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని పని చేయకుండా నిరోధిస్తున్న గవర్నర్లకు ముకుతాడు వేయాల్సిందే! ఎన్నికైన శాసన సభలకు విలువనిచ్చేలా, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు పని చేసేందుకూ ఆర్టికల్ 200 పేర్కొన్న 'సాధ్యమైనంత త్వరగా' అంటే ఎంత గడువు అన్నది సుప్రీం కోర్టు నిర్ణయించాలి. ఇది ప్రజాస్వామ్యమే తప్ప రాజ్‌భవన్ రాజ్ కారాదు. భారత రాజ్యాంగ మూలస్తంభాల్లో ముఖ్యమైన ఫెడరల్ వ్యవస్థను కాపాడడానికి సర్వోన్నత న్యాయస్థానం పూనుకోవడం అవసరం. శాసన, పరిపాలన, న్యాయ వ్యవస్థల మధ్య అధికార పరిధులను రాజ్యాంగమే స్పష్టంగా నిర్దేశించింది. వాటి మధ్యగల లక్ష్మణ రేఖను ఉల్లంఘిస్తే సరి చేయవలసిన విద్యుక్త ధర్మం న్యాయ వ్యవస్థపైనే ఉంది. ఆ ధర్మాన్ని సర్వోన్నత న్యాయస్థానం నిర్వర్తిస్తుందని విశ్వసిద్దాం.

మహనీయుల మాట

ఉత్సాహంతో శ్రమించడం,
అలసటను ఆనందంగా అనుభవించడం
విజయాన్ని కాంక్షించేవారి
ప్రాథమిక లక్షణాలు.
- స్వామి వివేకానంద

విశ్లేషణ

పేదోడి సొంతింటి కల నెరవేరేనా?

రాష్ట్రంలో చాలా సంవత్సరాలుగా ఎన్నికల అవసరాల కోసం పాలక పార్టీలు ఇళ్లు, ఇంటి స్థల సమస్యలను వాడుకోవడం రివాజుగా మారింది. ఇందిరమ్మ ఇళ్లు, టిడ్కో ఇళ్లు, జన్మభూమి ఇళ్లు, జగనన్న ఇళ్లు...ఇలా అనేక ఇంటి పథకాలను ఆ పార్టీలు ప్రకటించడం, పేదల ఓట్లు కొల్లగొట్టడం జరుగుతూనే ఉంది. పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటూ హామీలిస్తారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పేదలకు ఇళ్లు ఇవ్వకపోగా వారు వేసుకున్న గుడిసెలను కూడా కూల్చివేయడం పాలకుల నయవంచనకు నిదర్శనం.

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్నది. నా ఎస్.సి, నా ఎస్.టి, నా బి.సి లు అంటూ ముఖ్యమంత్రి కొత్త రాగం అందుకున్నారు. ఇదే సందర్భంలోనే అనంతపురం, కడప, శ్రీసత్య సాయి జిల్లాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను పోలీసు, రెవిన్యూ అధికారులు దౌర్జన్యంగా కూల్చివేస్తున్నారు. ఆ పేదలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. జగనన్న ఇళ్ల పథకం ఆచరణలో ఒట్టిపోయిన గేదె లాగా తయారైంది. గత టిడిపి ప్రభుత్వ టిడ్కో ఇళ్ల నిర్మాణం ఇలాగే మధ్యంతరంగా ఆగిపోయింది. రాష్ట్రంలో చాలా సంవత్సరాలుగా ఎన్నికల అవసరాల కోసం పాలక పార్టీలు ఇళ్లు, ఇంటి స్థల సమస్యలను వాడుకోవడం రివాజుగా మారింది. ఇందిరమ్మ ఇళ్లు, టిడ్కో ఇళ్లు, జన్మభూమి ఇళ్లు, జగనన్న ఇళ్లు...ఇలా అనేక ఇంటి పథకాలను ఆ పార్టీలు ప్రకటించడం, పేదల ఓట్లు కొల్లగొట్టడం జరుగుతూనే ఉంది. పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటూ హామీలిస్తారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పేదలకు ఇళ్లు ఇవ్వకపోగా వారు వేసుకున్న గుడిసెలను కూడా కూల్చివేయడం పాలకుల నయవంచనకు నిదర్శనం. ప్రభుత్వం లక్షల ఇళ్లు కట్టిస్తుంటే కమ్యూనిస్టుల గుడిసెలు వేయడమేమిటని కొందరు అధికారులు అమాయకంగా మాట్లాడుతుంటారు. గుడిసెలు వేసుకోవడం వాటిని అమ్ముకోవడం, తిరిగి ఇల్లు లేదని రోడ్లెక్కడం ఇదే అలవాటైందని కొందరు అధికార బలం, సామాజిక పెత్తందారీ మనస్తత్వంతో అంటుంటారు. కొందరు మధ్యతరగతి వారు తెలిసీ తెలియక ఇలాంటి వారి మాటలకు ప్రభావితం అవుతూ పేదలను, వారి పక్షాన పోరాడుతున్న కమ్యూనిస్టులను నిష్టూరంగా మాట్లాడుతుంటారు. పేదల ఇళ్ల సమస్య అర్థం కావాలంటే వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులు, పాలకుల నయవంచనా విధానాలు అర్థం చేసుకోగలగాలి.

వి. రాంభూపాల్

పేదలకు ఇల్లు ఎందుకు కావాలి?

రాష్ట్ర జనాభా 5.20 కోట్లు. వీరిలో 68.70 శాతం గ్రామాల్లో నివసిస్తున్నారు. ఒకవైపు వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో వుండి సాగు విస్తీర్ణం వేగంగా పడిపోతున్న స్థితిలో ఆ రంగంపైనే అత్యధికమంది ఆధారపడాల్సి రావడం రాష్ట్ర వెనుకబాటుకు నిదర్శనం. పల్లెల్లో భూములపై హక్కు వున్న ధనిక రైతాంగంలో ఎక్కువ మంది అక్కడ నివాసాలు ఉండడంలేదు. పిల్లల చదువులు, ఉద్యోగాలు, వ్యాపారాల పేరుతో పట్టణాలకు, నగరాలకు, మహా నగరాలకు వెళ్లిపోతున్నారు. గ్రామంలో ఒకనాడు పెత్తనానికి ప్రతిరూపాలుగా వున్న వీరి భవంతులు చాలా వరకు మూలపడి, బూజుపట్టి పోతున్నాయి. అయితే వీరికి ఆస్తి మీద హక్కు వుంది కాబట్టి రాజకీయ, సామాజిక పెత్తనాన్ని కొనసాగించడం కోసం వీరు తమ తోటల్లో ఆధునిక సౌకర్యాలతో నూతన భవంతులు నిర్మించుకుని అప్పుడప్పుడు గ్రామాలకు వెళ్లి వస్తుంటారు. సంఖ్య రీత్యా తక్కువైనా వీరి ప్రభావం మధ్యతరగతి రైతాంగం మీద ఎక్కువగా ఉంటుంది. ఈ మధ్యతరగతి కుటుంబాల్లో కొందరి పిల్లలు చదువుకుని కొత్త ఉద్యోగాలను సంపాదించు కోవడంతో...ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు గ్రామాల్లోని పాత ఇళ్లను ఆధునికంగా మార్చుకుంటున్నారు. ఈ రెండు తరగతుల వారికి ఇల్లు పెద్ద సమస్య కాదు. కానీ అత్యధికులైన వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులకు స్వంత ఇల్లు అనేది తీవ్రమైన సమస్య. ఈ కుటుంబాల్లో ఉన్న పిల్లల్లో అత్యధికమంది అదే గ్రామంలో ఉంటూ వ్యవసాయ, వ్యవసాయేతర పనుల మీద ఆధారపడి జీవిస్తున్నారు. పట్టణాలకు దగ్గరగా ఉన్న గ్రామాల వారు పట్టణాల్లో పని చేసుకుని గ్రామాల్లో వచ్చి నివసిస్తున్నారు. ఇలాంటి కుటుంబాలకు స్వంత ఇల్లు అనేది అత్యంత ముఖ్యమైన అవసరం.

పట్టణాల్లో ఉన్న 31.30 జనాభాలో ఉన్నతోద్యోగులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, పెద్ద వ్యాపారులు, పేరొందిన డాక్టర్లు, లాయర్లు, వృత్తి నిపుణుల ఇల్లు పట్టణ అభివృద్ధికి చిహ్నాలుగా భావించే పరిస్థితి ఏర్పడింది. పట్టణాలు, నగరాల్లో అత్యంత ఆధునికమైన, విలాసవంతమైన, విశాల భవనాలు కొన్ని కనిపిస్తాయి. ఇలాంటి భవంతులు మొత్తం పట్టణ నివాసాల్లో 10 శాతానికి అటుఇటుగా ఉంటాయి. మిగిలిన 90 శాతంలో అపార్ట్‌మెంట్లు, మధ్యతరగతి కాలనీలు, ఇతర నివాసాలు పోగా సుమారు 30 నుండి 40 శాతం మంది పేదలు మురికివాడల్లో నివసిస్తున్నారు. వీరంతా గ్రామాల నుండి వలసలు వచ్చిన పేదలు, వ్యవసాయంలో నష్టపోయి ఆస్తులను కోల్పోయి పట్టణాలకు చేరిన పేద రైతులు, సామాజిక వివక్షను సహించలేక పట్టణాలకు చేరుకున్న అట్టడుగు వర్గాల వారు. వీరికి స్వంత ఇల్లు అనేది జీవితకాల లక్ష్యంగా ఉంటుంది. తాము ఎక్కడ పని చేసినా రాత్రికి చేరుకోవడానికి, తమకంటూ ఒక అడ్రసు వుండడానికి ఇల్లు కావాలని గ్రామాల్లో, పట్టణాల్లో వుండే పేదలు కోరుకుంటారు. తమ తదనంతరం తమ వారసులకు ఒక నీడ ఇవ్వాలని భావిస్తుంటారు. పక్షులు సైతం గూడు ఏర్పాటు చేసుకుంటుంటే తమకు మాత్రం సొంత గూడు లేదని నిట్టూరుస్తుంటారు. ఎవరు ఇల్లు ఇస్తామంటే వారి వెంట చేరతారు. ఎక్కడ గుడిసెలు వేస్తే అక్కడ వాలతారు. ఇల్లు సాధించుకోవడానికి ఎన్ని కష్టాలనైనా భరిస్తారు. ఎన్నికల రాజకీయంలో వీరి ఓట్లే నాయకుల తలరాతలు మార్చేస్తుంటాయి. అందుకే ఈ పేదల ఇంటి స్థలం, ఇల్లు అన్ని పార్టీలకు కీలకాంశం అవుతుంది. 'అందరికీ ఇల్లు' అని నినదిస్తారు. అయితే పాలక వర్గాలు ఇది చిత్తశుద్ధితో ఇచ్చే హామీ కానందున దశాబ్దాలు గడిచినా పేదలకు స్వంత ఇంటి కల కలగానే మిగిలిపోతుంది.

జగనన్న ఇళ్లు

రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలను ఈ ప్రభుత్వం గుర్తించి 30 లక్షల 60 వేల మందిని అర్హులుగా ఎంపిక చేసింది. వీరికి 15,901 లేఅవుట్ల కింద మొదటి దశలో 15 లక్షల 60 వేలు, రెండవ దశలో 12 లక్షల 70 వేల ఇళ్లు, మిగిలిన ఇళ్లను ఆ తరువాత కట్టిస్తామని హామీ ఇచ్చింది. ఈ ఇళ్ల నిర్మాణానికి లక్ష 30 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. గత సంవత్సరం డిసెంబర్ 21న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా రాష్ట్రంలో 5 లక్షల ఇళ్లలో సామూహిక గృహ ప్రవేశాలు చేస్తామని ప్రకటించి ప్రభుత్వం వాయిదా వేసింది. కారణం ఇళ్ల పూర్తికాకపోవడం. 30 లక్షల ఇళ్లు అని చెప్పిన నాలుగున్నర సంవత్సరాల తర్వాత పూర్తయిన ఇళ్ళు కేవలం లక్షన్నర మాత్రమే. ఈ లెక్కన ఇప్పుడున్న ఇల్లు లేని 30 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ళు దక్కాలంటే మరో 30 సంవత్సరాలు పడుతుంది. జగనన్న ఇళ్ల నిర్మాణం కింద అనంతపురం జిల్లాకు 68,288 ఇళ్లు మంజూరు కాగా పూర్తయినవి కేవలం పది వేలు మాత్రమే. జిల్లా కేంద్రం అనంతపురం నగరంలో 19,298 ఇళ్ల మంజూరైతే, పూర్తయినవి మాత్రం కేవలం వెయ్యి లోపు. రాష్ట్ర మంతటా ఇంచుమించు ఇదే పరిస్థితి. నవరత్నాల్లో భాగమైన వైఎస్ఆర్ జగనన్న ఇంటి పథకం ఇంత అధ్వానంగా ఎందుకు అమలైంది అన్నది ప్రశ్న.

టిడ్కో ఇళ్లు

గత తెలుగుదేశం ప్రభుత్వం ఎ.పి. టిడ్కో (ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా 3.13 లక్షల ఇళ్లు నిర్మించాలని ఎన్నికలకు సంవత్సరం ముందు అంటే 2018లో లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఇళ్లను మూడు రకాలుగా 300 చదరపు అడుగులు, 365, 430 చ.అడుగుల ఇళ్లగా విభజించారు. లబ్ధిదారుల నుండి లక్ష, లక్షన్నర, రెండు లక్షల రూపాయలు డిపాజిట్ చేయించుకున్నారు. లేఅవుట్లు వేసి, కొద్దిమేరకు నిర్మాణాలు చేపట్టారు. సంవత్సరంలోపు ఈ ఇళ్లు నిర్మించడం సాధ్యం కాదని నాటి ప్రభుత్వానికి తెలుసు. వీటిని చూపి ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చునుకున్నారు. అధికారంలోకి వచ్చిన వైసిపి మధ్యస్తంగా ఆగిపోయిన టిడ్కో ఇళ్లను పూర్తిచేసి పేదలకు ఇవ్వకుండా గత నాలుగు సంవత్సరాలు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గతంలో మంజూరైన ఇళ్లల్లో 25 శాతంలోపు పనులు కాని 51,616 ఇళ్లను రద్దు చేశారు. ఇలా రద్దు చేయడం వల్ల 260.74 ఎకరాల భూమి మిగులుగా ఏర్పడింది. ఈ భూమిని అమ్మి టిడ్కో ఇళ్ల పూర్తి చేయాలని భావించారు. అంటే వారి వేలితోనే వారి కంటిని పొడవడం అన్నమాట. అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో ఈ మిగులు భూమి 140 ఎకరాలు వుండడం గమనార్హం.

పేదల ఇళ్ల నిర్మాణం పట్ల ఎందుకింత నిర్లక్ష్యం?

కూడు, గుడ్డ, నీడ మనిషి కనీస అవసరాలని, వీటిని తీర్చడం ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతగా ఉండాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు చెబుతాయి. ఇళ్లు ఇస్తామని పార్టీలు, ప్రభుత్వాలు చెబుతాయి. కాని పేదలకు సొంతింటి కల ఎందుకు నెరవేరడంలేదు. పాలకుల వర్గ స్వభావమే ఇందుకు మూల కారణం. పేదలు పేదరికంలో వుంటేనే పాలకులు వేసే చిట్కా పథకాలకు ఎగబడతారు, ఓట్లు వేస్తారు. అర్హులైన పేదలకు పట్టణాలకు దూరంగా ఇళ్లు నిర్మిస్తే సంపన్నుల పనులు చేసేవారు ఎవరు? దగ్గరగా నిర్మిస్తే లక్షల కోట్ల వ్యాపారంగా విజృంభిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎలా జరుగుతుంది? ప్రభుత్వ స్థలాలు పేదలకు పంచితే తమ పార్టీ వారు, కొందరు అధికారులు కబ్జాలు చేసుకోవడానికి, కోట్లు సంపాదించుకోవడానికి అవకాశం ఎలా ఉంటుంది?

అనంతపురం జిల్లాలోని గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో మూడు సంవత్సరాలుగా కాపురం ఉన్న 150 మంది పేదల ఇళ్లను (హైకోర్టులో పెండింగ్ ఉన్నప్పటికీ) నవంబర్ 1న కూల్చివేశారు. ఆ స్థలం దేవుని మాన్యం అని చెబుతున్నారు. అదే గ్రామంలో 56.37 ఎకరాల దేవుని మాన్యం భూములను అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆక్రమించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. శ్రీసత్య సాయి జిల్లా చిలమత్తూరు గ్రామంలో జగనన్న ఇళ్ల కోసం స్థలం సేకరించారు. లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారు. కానీ స్థలాన్ని చూపలేదు. పేదలకివ్వాలని అధికారులు చూపిన స్థలం బెంగళూరు–హైదరాబాద్ హైవే పక్కన వుండ డంతో అధికార పార్టీ నాయకుల కన్ను పడి దానిని ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. పేదలు గుడిసెలు వేసుకుంటే కూల్చి, కాల్చివేశారు. కడప జిల్లా పోరుమామిళ్ల గ్రామంలో ఇలాగే పేదలు వేసుకున్న ఇళ్లను కూల్చివేశారు. పోరాటాల ద్వారా పేదలు తమ ఇంటి సమస్యను పరిష్కరించుకోవడం తప్ప ఇంకో మార్గం లేదు. అందుకు ఐక్య పోరాటమే దారి.

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

★

కామన్ సైన్స్

దయాగుణం అలవరచుకుందాం

విశ్వ దయాగుణోద్యమంలో భాగంగా ప్రతి సంవత్సరం నవంబర్ 13న ప్రపంచ దయాగుణ దినాన్ని జరుపుకుంటున్నాం. మానవీయ విలువల్ని పెంపొందించుకోవడానికి ప్రేమ, సౌహార్ద్రాలతో మానవ జీవనం మనుగడ సాగించడానికి, ఒకరి పట్ల ఒకరికి గల గౌరవాన్ని, బాధ్యతను తెలుపుకోవడానికి ఈ రోజును జరుపుకుంటున్నాం. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య మాత్రమే కాదు, జాతుల మధ్య, సమాజాల మధ్య, ప్రాంతాల మధ్య, దేశాల మధ్య కూడా వెల్లివిరియాలని. 'వసుధైక కుటుంబకం' అనే భావన అన్ని రకాలుగా, అన్ని స్థాయిల్లో ఏర్పడాలనీ – అంతకు ముందు ఏర్పడింది వర్ధిల్లుతూ ఉండాలనీ ఒక ఆకాంక్షతో, ప్రపంచ పౌరులు ఈ రోజును జరుపుకుంటున్నారు.

దయాగుణాన్ని మించిన విజ్ఞత మరొకటి లేదు. దయాగుణమనేది ఒక గొప్ప కానుక. అది ఉచితంగా ఇవ్వగలిగేది. దాన్ని తప్పకుండా పంచుతూ పోవాలి. ఎదుటివాళ్లు ఎవరూ అని చూడకుండా, తిరిగి వాళ్లు మనకేమివ్వగలరని చూడకుండా, ఇతరులకు ఇస్తూ ఉండడమే దయాగుణం! అలాంటి వారి దగ్గర ఉన్న దయా ధనం ఎన్నటికీ తరిగిపోదు. ఇతరులకు ఇచ్చి పేదవాడై పోయినవాడు, చితికిపోయినవాడు, చెడిపోయినవాడు లేడు. దయలోంచి వచ్చిన ప్రేమతో చెప్పిన చిన్న మాటయినా సరే, ఎదుటి వారి జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. ఒక్కోసారి మార్చేస్తుంది కూడా! దయతో చేసే చిన్న సహాయమైనా సరే, దానికి ప్రేమను జత చేస్తే – ఆ సహాయం విలువ ఎన్నో రెట్లు పెరుగుతుంది.

మనమంతా ఒక్కటే అన్న భావన ఉన్నప్పుడే పైవన్నీ జరుగుతాయి. మనుషుల్లో స్థాయీ భేదాలు లేవు. అందరం ఒక్కటే అన్నది ఆధునిక జన్యు శాస్త్రం చెప్పింది. ఇందులో ఏ ఒక్క విషయమూ దేనికదే విడిగా ఉండదు. ఎందుకంటే అన్నీ ఒక దానితో ఒకటి అంతర్గతంగా పెనవేసుకుని ఉన్న విషయాలు. మంచితనం లేకపోతే దయాగుణం ఉండదు. మంచివాడు కాగానే సరిపోదు. అతడు జ్ఞానవంతుడైనపుడే సమాజానికి ఉపయోగపడతాడు. అజ్ఞానిగా ఉన్నవాడికి ఏది మంచో ఏది చెడో తెలియదు. దయ ఎప్పుడు ఎవరి మీద చూపాలో తెలియదు. ఇలా ఒక దగ్గర కదిలిస్తే తీగంతా కదులుతుంది. ఆరోగ్యవంతమైన, ఆనందకరమైన, ప్రపంచం వర్ధిల్లాలంటే ముందు వైజ్ఞానిక దృక్పథం అవసరం. అది నిండుగా ఉన్నవాడే విశ్వ మానవుడవుతాడు. అలా అయినప్పుడే వ్యక్తుల నుండి దేశాల దాకా ఆ స్థాయిలో చేయవల్సిన పనులు ఏమిటన్నది నిర్ణయించుకోగలడు.

దయను చూపించు (బి కైండ్) అని ఏడాదికి ఒక్కరోజు ప్లకార్డులు పట్టుకుని రోడ్ల మీద తిరగడం కాదు. జాతుల మధ్య వైరాల్ని, దేశాల మధ్య యుద్ధాల్ని ఆపడానికి చేయాల్సిన కార్యక్రమాలేవో ఆలోచించుకోవడానికి, చర్చించుకోవడానికి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి, వాటిని ఆచరించడానికి ఈ వరల్డ్ కైండ్‌నెస్ డే స్ఫూర్తినివ్వాలి! కుల మతాల, జాతుల, ప్రాంతీయ హద్దుల్ని, రాజకీయ విభేదాల్ని, దేశాల సరిహద్దుల్ని దాటి–విశ్వ జనులందరూ ఒక సదభిప్రాయ సోదరత్వ భావనకు రావడానికి ఈ 'వరల్డ్ కైండ్ నెస్ డే' తోడ్పడాలి! మంచి కృషిని అభినందించడానికి, మంచి అవగాహనను పెంచడానికి, మానవాళిని ఒక దయాగుణంతో ఐక్యం చేయడానికి. ప్రపంచ వ్యాప్తంగా మానవుల స్థితిగతుల్ని మెరుగుపరచడానికి 'వరల్డ్ కైండ్‌నెస్ డే' జరుపుకుంటూ ఉండాలి!!

ఆ రోజు ఏం చేస్తున్నారంటే–పరిచయం ఉన్నా లేకపోయినా అందరితో చేతులు కలిపి 'హేపీ కైండ్‌నెస్ డే'–అని చెప్పుకోవడం. ఒకరికి ఒకరు పసుపు పచ్చని పూలు ఇచ్చుకోవడం. దగ్గరికి తీసుకుని హత్తుకోవడం చేస్తున్నారు. దయాగుణం ఇతి వృత్తంగా కొన్ని దేశాల్లో సంగీత కచేరీలు నిర్వహిస్తున్నారు. ఈ రోజు ప్రత్యేకత గురించి ఎన్నో దేశాల్లో ఉపన్యాసాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రియమైన వారి దగ్గరికెళ్ళి వారి వల్ల తమ జీవితమెంత ఉత్తేజితమైందో సౌమ్యంగా చెప్పుకుంటారు. లేదా ఒక మెసేజ్/ఇ-మెయిల్ పంపుకుంటారు. అందుబాటులో ఉంటే వారి కంప్యూటర్ స్క్రీన్ మీద గాని, వారి కారు ముందు అద్దం మీద గానీ మంచి సందేశం–కామెంట్ పెడతారు. ఇవన్నీ ఎందుకంటే స్నేహబంధాల్ని, బాంధవ్యాల్ని మరింత లోతుగా పటిష్ట పరుచుకోవడానికే–ఇలాంటి ప్రయత్నాలు సంఘాల మధ్య, సమాజాల మధ్య, దేశాల మధ్య కూడా జరుగుతున్నాయి. అవి ఇంకా జరగాలి. అప్పుడే 'వరల్డ్ కైండ్‌నెస్ డే' సార్థకమౌతుంది.

ఇవన్నీ కాకుండా పాఠశాల, కళాశాల పిల్లలకు – సహాయం చేయడం గురించి, దయ చూపించడం గురించి బోధిస్తున్నారు. ఆ లేత మనసుల్ని మంచి ఆలోచనలతో నింపుతున్నారు. దగా, మోసం వంటి వాటిని అణిచిపెట్టి దయ, సానుభూతి, సహకారం వంటి వాటిని పిల్లల మనసుల్లో నాటుకునేట్లు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. పిల్లల పట్ల శ్రద్ధ చూపే ఈ కార్యక్రమాలకు ఎన్‌జిఓలు, ప్రయివేట్ సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగాలు అన్నీ కొన్ని దేశాలలోనైతే చాలా చురుకుగా పాల్గొంటున్నాయి. సంప్రదాయాల పేరుతో అబద్దాల కట్టుకథల ఆధారంగా చేసుకునే పండగలు మానెయ్యాలి. వాస్తవాలేమిటో, నిజాలేమిటో తెలుసుకోగలగాలి. మనిషి కేంద్రంగా అతడు సాధించిన ఘన విజయాల్ని నెమరువేసుకోవాలి! ఆధునిక జీవితానికి దోహదపడే విధంగా సమాంతర వేడుకలకు, ఉత్సవాలకు రూపకల్పన చేసుకోవాలి! పాత నిర్వచనాల్ని మార్చుకోవాలి!!

దయా గుణానికున్న ఔన్నత్యాన్ని భ్రమల్లో, కల్పితాల్లో ద్విగుణీకృతం చేసుకున్నంత మాత్రాన సమాజంలో మార్పు రాదు. వాస్తవ జగత్తులో ప్రత్యక్షంగా దాన్ని అనుభవంలోకి తెచ్చినపుడే సమాజ స్వరూపం మారుతుంది. జీవిత మంటే నటిస్తూ వినోదం అందించే నాటకమో, సినిమానో, టీవీ సీరియలో కాదు. జీవితం ఉన్నది జీవించడానికి! జీవితంలో ఉండాల్సినవి నిజం, నిబద్ధత, ప్రేమ, ఆప్యాయత, సహనం, సహకారం–మనసు లోతుల్లో దయా గుణం లేకపోతే ఇవేవీ ఉండవు.

డా॥ దేవరాజు మహారాజు,

సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ (మెల్బోర్న్ నుంచి)

సందర్భం

సైన్స్ పట్ల నమ్మకం

ప్రపంచ సైన్సు దినోత్సవ నినాదం

గత 20 సంవత్సరాలుగా, ప్రపంచంలోని అనేక దేశాల్లో, నవంబరు 10వ తేదీని వరల్డ్ సైన్స్ డే గా జరుపుతున్నారు. ఇది యునెస్కో కార్యక్రమం. శాంతియుత పరిస్థితుల కోసం, సుస్థిర అభివృద్ధి కోసం సైన్స్ ఏ విధంగా ఉపయోగపడుతుందో చూడటం దీని ముఖ్య ఉద్దేశం. సైన్సు ముందుకు తెచ్చే నూతన భావనలను, అవగాహనలను ప్రజలలోకి తీసుకుపోవడం కూడా ఇందులో ఉంది. 1999లో హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో మొట్టమొదటి అంతర్జాతీయ సైన్స్ కాన్ఫరెన్స్ జరిగింది. సాధారణ ప్రజల్లోకి సైన్స్‌ను పెద్ద ఎత్తున తీసుకెళ్లాలని అక్కడ నిర్ణయించుకున్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ 10ని ప్రపంచ సైన్స్ దినంగా జరపాలని 2002లో జరిగిన యునెస్కో కార్యనిర్వాహక సమావేశం, సభ్య దేశాలకు పిలుపునిచ్చింది. అయితే మన దేశంలో దీనికి అంతగా ప్రాచుర్యం లభించలేదు. ఇప్పుడున్న పరిస్థితులలో దీని ప్రాధాన్యతను గుర్తించిన జనవిజ్ఞాన వేదిక, ప్రపంచ సైన్సు దినోత్సవాన్ని రాష్ట్రమంతటా నిర్వహిం చాలని పిలుపునిచ్చింది. ఈ రోజున, స్కూలు స్థాయిలో జరుగుతున్న చెకుముకి సంబరాలతో కలిపి ఈ కార్యక్రమం జరుగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల మందికి పైగా హైస్కూలు విద్యార్థులకు ఈ సందేశం అందించనున్నారు.

ఈ సారి పిలుపు...

ఈ సంవత్సరం సైన్స్ డే సందర్భంగా 'సైన్స్ పట్ల నమ్మకం' (ట్రస్ట్ ఇన్ సైన్స్) అనే అంశంపై చర్చ జరగాలని యునెస్కో పిలుపునిచ్చింది. ప్రస్తుతం ఉన్న సామాజిక పరిస్థితులు, ప్రభుత్వ విధానాల నేపథ్యంలో ఈ చర్చ జరగాలని భావించింది. సామాజిక పురోగతి జరగాలంటే సైన్స్ మీద నమ్మకం పెట్టాలి. ఆశ్చర్యకరంగా భారతదేశంలో నూటికి 59 మంది ప్రజలు... శాస్త్రవేత్తల పైన, సైన్స్ పైన నమ్మకం చూపించారు. ఇంగ్లాండు, జర్మనీ, ఆస్ట్రేలియా లాంటి దేశాలలో కంటే కూడా ఇది ఎక్కువ. 2020లో ఒఇసిడి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సైన్స్ సర్వే దీన్ని పేర్కొంది. కోవిడ్ నేపథ్యంలో జరిగిన ఈ పరిశీలన, ప్రజాసైన్స్ ఉద్యమాలకుగల సానుకూల పరిస్థితులను తెలియజేస్తుంది. అయితే సైన్స్ పట్ల అపనమ్మకాలను పెంచే ప్రయత్నాలు, ప్రభుత్వ వ్యవస్థల నుండే జరుగుతున్నాయి. ప్రజలలో సైన్సుకున్న ప్రతిష్టను ఆధారంగా చేసుకుని సూడో సైన్స్‌ను సైన్స్‌గా ప్రచారం చేయటానికి పూనుకుంటున్నారు. ప్రజలకు న్న నమ్మకాల ఆధారంగా, ఈ పని చేస్తున్నారు. రుజువుల ఆధారంగా శాస్త్రీయ భావనలను ఓపికగా ప్రజల ముందు పెట్టడమే మనం చేయాల్సింది.



డా॥ గేయానంద్

శాస్త్రీయ విద్య–ప్రజల వద్దకు సైన్స్

సైంటిఫిక్ లిటరసీ, ఓపెన్ సైన్స్ అనే రెండు భావాలను యునెస్కో ప్రచారం చేస్తోంది. రోజువారీ జీవిత కార్యకలాపాలలో సరైన నిర్ణయం తీసుకోవడానికి అవసరమైన శాస్త్రీయ భావనలను, పద్ధతులను తెలుసుకోవటమే శాస్త్రీయ విద్య అనొచ్చు. అలాగే సామాజిక సాంస్కృతిక ఆర్థిక జీవితంలో పాలు పంచుకోవడానికి అవసరమైన శాస్త్ర విజ్ఞానాన్ని కలిగి ఉండటం కూడా. సమాజంలో బలమైన శాస్త్రీయ విద్య ఉండాలంటే మన స్కూళ్లలో, కాలేజీలలో ఒక నాణ్య మైన సైన్సు బోధన జరగాలి. సైన్స్ అంటేనే పరిశీలనలు, ప్రయోగాలు. కానీ నేడు సైన్స్ అంటేనే ర్యాంకులు, గ్రేడ్లు, మార్కులుగా మారిపోయింది. అందుకే మౌలిక పరిశోధనా రంగంలో వెనకబడి పోయాం.

యునెస్కో ముందుకు తెచ్చిన మరొక భావన–ఓపెన్ సైన్స్. సైన్సు కానీ, సైన్సు పరిశోధనలు కానీ రహస్యంగా ఉండాల్సిన అవసరం లేదని ఇది చెబుతుంది. సైన్స్‌కు సంబంధించిన నిర్ణయాలలో, సాధారణ ప్రజల ప్రయోజనాలు, భాగస్వామ్యం ఉండాలని చెబుతుంది. కానీ ప్రస్తుతం సైన్స్ దశను, దిశను కార్పొరేట్ శక్తులు నియంత్రిస్తున్నాయి. ఒక ఉత్పత్తి శక్తిగా, శాస్త్ర పరిశోధనలు కార్పొరేట్ల గుప్పెట్లో ఉన్నాయి. కాబట్టి ఓపెన్ సైన్స్ భావనను మరింత విస్తృతం చేసి, శాస్త్ర సాంకేతిక ఫలితాలు ప్రజలందరికీ చెందేట్టుగా ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బయో టెక్నాలజీ లాంటి శాస్త్రాలలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్న నేటి తరుణంలో ఓపెన్ సైన్స్ భావనను అందరూ ప్రచారంలో పెట్టాలి. ఇప్పుడు జన విజ్ఞాన వేదిక చేస్తున్న శాస్త్ర ప్రచార ఉద్యమం ఇందుకు ఉపయోగపడుతుంది.

దేశవ్యాప్త ప్రచార ఉద్యమం

జన విజ్ఞాన వేదిక, ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ ఈ నెల ఏడవ తేదీ నుండి వచ్చే ఫిబ్రవరి 28 దాకా పెద్ద ఎత్తున రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఈ సైన్స్ ప్రచార ఉద్యమాన్ని చేపడుతున్నాయి. అందులో భాగంగానే ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నాయి. సూడో సైన్స్, సైన్సు వ్యతిరేక ధోరణులకు ప్రభుత్వ వ్యవస్థలలోనే ప్రేరణ, ప్రోత్సాహం దొరుకుతున్న సందర్భంలో... అసలుసిసలు సైన్స్ భావాలను, ఆలోచనా పద్ధతులను వివిధ రూపాలలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. జీవ పరిణామం, పదార్థం, చరిత్ర గమనం లాంటి శాస్త్రీయ అంశాల బోధనను బలహీనపరిచే ప్రయత్నాలను చూస్తున్నాం. ఒక విధంగా ఇవన్నీ శాస్త్రీయ దృక్పథాన్ని బలహీన పరిచేందుకు చేస్తున్న ప్రయత్నాలే. వీటికి బలమైన సమాధానం సైన్స్ ద్వారా, ప్రజా ఉద్యమాల ద్వారా ఇవ్వాలి.

/ వ్యాసకర్త జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు /

HEMADRI CEMENTS LIMITED

Address: Vedadri Village, Jaggaiahpet Mandal, Krishna Dist (A.P) - 521 457
Statement of Un-Audited Financial Results for the Quarter ended 30-09-2023 pursuant to Regulation 33 of SEBI (LODR) Regulations, 2015
CIN : L26942AP1981PLC002995

(Rs.in lakhs)

S.No.	Particulars	Three months' ended			Six months ended		Year Ended
	Period Ending	30.09.23	30.6.23	30.09.22	30.09.23	30.09.22	31.3.2023
		Un-Audited	Un-Audited	Un-Audited	Un-Audited	Un-Audited	Audited
1	Revenue from Operations	1,203.08	1,448.16	1,198.93	2,651.24	3,076.97	6,837.24
2	Other Operating Income	-	-	-	-	-	-
3	Other Income	41.67	36.56	3.38	78.23	33.29	232.43
	Total Income	1,244.75	1,484.72	1,202.31	2,729.47	3,110.26	7,069.67
4	Expenses						
	a) Cost of Material consumed	275.46	364.06	336.12	639.52	730.84	1,674.46
	b) Purchase of Stock-in-Trade	-	-	-	-	-	-
	c) Changes in inventories of finished goods,work-in-progress and stock -in- trade	(32.87)	219.19	278.10	186.32	542.44	158.87
	d) Power and Fuel	833.64	793.70	598.93	1,627.34	1,596.63	4,454.08
	e) Employee benefits expenses	128.78	142.79	142.96	271.57	284.69	615.94
	f) Finance costs	33.97	30.44	16.58	64.41	26.69	76.80
	g) Depreciation and amortisation expense	46.77	46.77	47.54	93.54	94.89	194.74
	h) Other Expenses	308.08	343.54	254.03	651.62	608.97	1,941.11
	Total Expenses	1,593.83	1,940.49	1,674.26	3,534.32	3,885.15	9,115.99
5	Profit Before Tax and Exceptional Items(3-4)	(349.08)	(455.77)	(471.95)	(804.85)	(774.89)	(2,046.32)
6	Exceptional Items	-	-	-	-	-	-
7	Profit Before Tax (5-6)	(349.08)	(455.77)	(471.95)	(804.85)	(774.89)	(2,046.32)
8	Tax Expense						
	Current Tax	-	-	-	-	-	-
	MAT credit	-	-	-	-	-	-
	Deferred Tax	-	-	-	-	-	(527.63)
	Excess Provision reversed	0.94	(0.94)	-	-	-	10.53
	Net Tax Expense / (Benefit)	0.94	(0.94)	-	-	-	(517.10)
	Net Profit / (Loss) for the period	(350.02)	(454.83)	(471.95)	(804.85)	(774.89)	(1,529.22)
10	Other Comprehensive Income						
	(i)Items that will not be reclassified to Profit and Loss	-	-	-	-	-	(5.17)
	ii) Income tax on above	-	-	-	-	-	(1.35)
	Other Comprehensive Income	-	-	-	-	-	(3.83)
11	Total Comprehensive Income (Comprising Profit and Other Comprehensive Income) (9+10)	(350.02)	(454.83)	(471.95)	(804.85)	(774.89)	(1,533.05)
	PAID UP CAPITAL (66,70,000 nos's of equity share of Rs 10/- each)	667.00	667.00	667.00	667.00	667.00	667.00
12	Earnings Per Share						
	(a) Basic	(5.25)	(6.82)	(7.08)	(12.07)	(11.62)	(22.93)
	(b) Diluted	(5.25)	(6.82)	(7.08)	(12.07)	(11.62)	(22.93)

Notes:

1	The Company's business operations comprises of a single segment viz., cement and materials
2	The Above Statement has been prepared to the extent applicable, in accordance with the Companies (Indian Accounting Standards) Rules, 2015 prescribed under Section 133 of the Companies Act, 2013 and Other recognised Accounting Practices and policies adopted by the Company w.e.f 01.04.2018.
3	The above Un-Audited Results were reviewed by the Audit Committee and approved by the Board of Directors at their meeting held on 09.11.2023. The Statutory Auditors have carried out Limited Review of the above results
4	In view of losses in this half year ended, Income tax/ Deferred tax provision is not considered and the same will be considered in subsequent quarters or at the year end.
5	Previous period numbers have been regrouped wherever necessary.

For Hemadri Cements Limited
sd/-
Dr Ananda Balasubramaniyan
Managing Director
DIN: 02702557

Place : Chennai
Date : 09-11-2023

భారంగా రీపేమెంటు

- ప్రతినెలా వాయిదాలకే రూ.1,400 కోట్లు
- అంకెలు సిద్ధం చేసిన ఆర్థికశాఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

తీసుకున్న రుణాలపై వాయిదాలు ఖజానాకు భారంగా కనిపిస్తున్నాయి. ప్రతినెలా రూ.1,400 కోట్లకుపైగా వాయిదాల చెల్లింపులు జరుగుతున్నాయి. ఇందులో పనిచేయని శాఖల ద్వారా తీసుకున్న రుణాలపై కూడా చెల్లింపులు చేయాల్సి రావడమే భారంగా ఉందని ఆర్థికశాఖ అధికారులు వాపోతున్నారు. ఐదేళ్లుగా ఒక్క పని కూడా జరగని అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ), రుణాలతో సంబంధంలేని ఫైబర్‌నెట్, ఎపిఐఐసి వంటి శాఖల్లో నూ రుణ వాయిదాలు చెల్లించాల్సి రావడం గమనార్హం. రాష్ట్రంలోని 13 సంస్థల రుణాలను పూర్తిగా ప్రభుత్వ రుణాలుగానే పరిగణించాల్సి ఉంటుంది. ఎందుకంటే ఈ రుణాలు నేరుగా ప్రభుత్వమే పలు కార్యక్రమాలకు వినియోగించుకుంది. వీటి ద్వారా సేకరించిన రుణాలపై ప్రతినెలా రూ.1,400 కోట్ల నుంచి రూ.1,500 కోట్ల వరకు అసలు, వడ్డీ కింద చెల్లించాల్సి వస్తోంది. ఒక్క సెప్టెంబరులోనే రూ.1,473 కోట్లు చెల్లించాలని ఆర్థికశాఖ చెబుతోంది. ఇది కొన్ని నెల్లో మరింత పెరిగే అవకాశాలున్నాయని కూడా అధికారులు అంటున్నారు. 13 సంస్థలకు సంబంధించి ఎపిఎస్‌డిసి (రాష్ట్రాభివృద్ధి సంస్థ) రుణాలపైన రూ.248 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. తరువాత ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎపి టిడ్కో రుణాల కింద రూ.210 కోట్లు చెల్లించాలని గుర్తించారు. మిగిలిన శాఖలకు సంబంధించి జలవనరుల అభివృద్ధి సంస్థ రుణాలపై రూ.203 కోట్లు, నాబార్డు నుంచి తీసుకున్న రుణాలపై నెలకు రూ.224 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి వస్తోంది.

సిఆర్‌డిఎ రుణాలపై..

ఏళ్ల తరబడి ఒక్క పనీ సాగని రాజధాని నిర్మాణంపై గత, తాజా ప్రభుత్వాలు తీసుకున్న రుణాలపై ప్రతినెలా రూ.14 కోట్ల వరకు అసలు, వాయిదాల కింద చెల్లింపులు చెల్లించాల్సి వస్తోందని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే ఎపి ఫైబర్‌నెట్ ద్వారా రూ.17 కోట్లు, రైతు సాధికార సంస్థ ద్వారా రూ.37 కోట్లు, పట్టణ ఆర్థికాభివృద్ధి సంస్థ రుణాలపై రూ.4 కోట్లు, ఎపిఐఐసి ద్వారా రూ.53 కోట్లు వరకు ప్రతినెలా అసలు, వాయిదాల కింద చెల్లించాల్సి వస్తోందని ఆర్థికశాఖ పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

నెం. 72-75/డిఐ/పిఆర్/2023-24, తేది :06.11.2023

మొత్తం 3 బిల్డింగ్ పనులు & 1 రోడ్డు పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా [illegible] రూ.60.00 లక్షలు [illegible] ప్రారంభ తేది: 10.11.2023 నుండి, తదుపరి వివరాలకు దర్శించండి: www.tender.apeprocurement.gov.in, ఫోన్ నెం.9346424446

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, పిఆర్ డివిజన్, విజయవాడ

DIPRNo.11581/CL/ADVT/1/1/2021-22

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భృగుబండ (బ్రాంచి, భృగుబండ (గ్రామము), సత్తెనపల్లి మండలం, పిన్: 522403

బంగారు నగల వేలము నోటీసు

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు [illegible] **24.11.2023, శుక్రవారం** [illegible] **ఉ. 11-00 గం||లకు** [illegible] **మ. 4-00 గం||లకు** [illegible] **రూ.5000/-** [illegible]
ఖాతాదారులలో ఎవరైనా మరణించినయెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

క్ర. సం.	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	స్థూల బరువు గ్రాముల్లో
1	024316540001024	**గంపల భిక్షాలు, తండ్రి: బ్రహ్మయ్య,** డోర్ నెం.3-229, భృగుబండ, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా-522403	**19.80 గ్రాములు**

తేది: 09.11.2023
ప్రదేశం: భృగుబండ
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
భృగుబండ, పల్నాడు జిల్లా

ప్రీతికి పగ్గాలు..

మహిళల జూనియర్ ప్రపంచకప్ హాకీకు జట్టు ఇదే!

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం వేడెక్కింది. అధికార బిజెపి, ప్రతిపక్ష కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధం కాక పుట్టిస్తున్నది. ఈ క్రమంలో మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచార పర్వంలో పాల్గొన్నంటున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పరస్పరం మాటల తూటాలు పేలుస్తున్నారు. మోడీ కేవలం 90 మంది బ్యూరోక్రాట్లతో దేశాన్ని నడుపుతున్నారని రాహుల్ ఆరోపించారు. 'వెండి చెంచాలతో పుట్టిన' కాంగ్రెస్ నాయకులు అంటూ మోడీ రాహుల్‌ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఛతర్‌పూర్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగించిన ప్రధాని మోడీ కనీసం వందేళ్ల పాటు కాంగ్రెస్‌కు అధికారం లేకుండా చేయాలని ఓటర్లను కోరారు. 'ఇంతకుముందు, ఈ కాంగ్రెస్ నాయకులు తమ విదేశీ స్నేహితులకు భారతదేశ పేదరికాన్ని చూపించేవారు. వెండి చెంచాతో పుట్టిన కాంగ్రెస్ నాయకులకు.. పేదరికం పర్యాటకంగా ఉన్నది' అని మోడీ అన్నారు. అశోక్‌నగర్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి రాహుల్ మాట్లాడుతూ..దేశాన్ని ప్రధాని మోడీతో పాటు 90 మంది అధికారులే నడుపుతున్నారని తప్పుబట్టారు. 'మాది ఒబిసి ప్రభుత్వమ'ని చెబుతున్న బిజెపి ఈ 90 మంది అధికారుల్లో ఒబిసిలు ఎంతమంది ఉన్నారో చెప్పగలరా? అని నిలదీశారు.

65 శాతం కోటా బిల్లుకు బీహార్ అసెంబ్లీ ఆమోదం

పాట్నా : వెనుకబడిన, అత్యంత వెనుకబడిన తరగతులకు, ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రస్తుతమున్న 50 శాతం నుండి 65 శాతానికి రిజర్వేషన్ కోటాను పెంచుతూ బీహార్ అసెంబ్లీ గురువారం ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించింది. సాధ్యమైనంత త్వరలో బిల్లు నిబంధనలన్నింటినీ తమ ప్రభుత్వం అమలు చేస్తుందని సభ్యులకు ముఖ్యమంత్రి నితీష్ కుమార్ హామీ ఇచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కులాల సర్వే నిర్వహించిన దృష్ట్యా విద్యా సంస్థల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇవే రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందిస్తున్న బిల్లులను కూడా అసెంబ్లీ మూజువాణి ఓటుతో ఏకగ్రీవంగా ఆమోదించింది. సవరించిన బిల్లును గవర్నర్ ఆమోదం నిమిత్తం పంపనున్నారు.

అత్యంత వెనుకబడిన తరగతులు (ఇబిసి)కు రిజర్వేషన్ కోటాను ప్రస్తుతమున్న 18 నుండి 25 శాతానికి పెంచనున్నట్లు బిల్లు పేర్కొంది. అలాగే వెనుకబడిన తరగతులకు 12 నుండి 18 శాతానికి, ఎస్‌సిలకు 16 నుండి 20 శాతానికి, ఎస్‌టిలకు ఒక శాతం నుండి రెండు శాతానికి పెంచనున్నారు. వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు కల్పించే రిజర్వేషన్‌ను ప్రస్తుతమున్న మూడు శాతాన్ని రద్దు చేశారు.

మహువా పై 'బహిష్కరణ' వేటు

- ఎథిక్స్ కమిటీకి సిఫారసు
- 6-4 మెజార్టీతో ఆమోదముద్ర
- పక్షపాత ప్రతిపాదనగా పేర్కొన్న ప్రతిపక్షాల సభ్యులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటులో ప్రశ్నలు అడిగేందుకు డబ్బులు తీసుకున్నారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రీపై వేటు పడనుంది. 'ప్రశ్నకు నోటు' వ్యవహారంపై విచారణ చేపట్టిన పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ.. ఆమెను పార్లమెంటు నుంచి బహిష్కరించాలన్న ప్రతిపాదనకు పచ్చజెండా ఊపింది. ఇందుకు సంబంధించిన 500 పేజీల నివేదికకు 6:4 మెజార్టీతో కమిటీ ఆమోదముద్ర వేసింది. అయితే ఈ ప్రతిపాదనలు పక్షపాత ధోరణిలో చేసిన తప్పుడు ప్రతిపాదనలని ఎథిక్స్ కమిటీలోని ప్రతిపక్షాల సభ్యులు తప్పుబట్టారు. గురువారం నాడిక్కడ పార్లమెంట్ అనెక్స్ భవనంలో లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సమావేశం జరిగింది. మహువాను బహిష్కరించాలన్న సిఫార్సుకు అనుకూలంగా ఆరుగురు సభ్యులు ఓటు వేయగా.. నలుగురు వ్యతిరేకించారు. కమిటీలో 15 మంది సభ్యులు ఉండగా, గురువారం సమావేశానికి 10 మంది మాత్రమే హాజరయ్యారు. హాజరైన వారిలో కమిటీ ఛైర్మన్, బిజెపి ఎంపి వినోద్ కుమార్ సోంకర్, అదే పార్టీకి చెందిన ఎంపీలు అపరాజిత సారంగి, రాజ్‌దీప్ రాయ్, సుమేధనంద్ సరస్వతి, హేమంత్ గాడ్సే (శివసేన-షిండే), కాంగ్రెస్ ఎంపి ప్రణీత్ కౌర్ (ఇటీవల పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు ఆరోపణలపై కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురయ్యారు) మొయిత్రాను బహిష్కరించే ప్రతిపాదనను ఆమోదిస్తూ ఓటు వేయగా..ఆ ప్రతిపాదనను కాంగ్రెస్ ఎంపి వి. వైతిలింగం, సిపిఎం ఎంపి పిఆర్ నటరాజన్, జెడియు ఎంపి గిరిధారి యాదవ్, బిఎస్పీ ఎంపి కున్వర్ డానిష్ అలీ వ్యతిరేకించారు.

బిజెపి ఎంపిలు విష్ణు దత్ శర్మ, సునీతా దుగ్గల్, సుభాష్ భామ్రే, వైసిపి ఎంపి వల్లభనేని బాలశౌరి, కాంగ్రెస్ ఎంపి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గైర్హాజరు అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ దాఖలు చేయనుండంతో తాను హాజరుకాలేనని, సమావేశం తేదీని రీ షెడ్యూల్ చేయాలని ఛైర్మన్ వినోద్ కుమార్‌కు కాంగ్రెస్ ఎంపి ఎన్ ఉత్తమ్ కుమార్ చేసిన విజ్ఞప్తిని పట్టించుకోలేదు.

మహువా మోయిత్రా చర్యలు అత్యంత అభ్యంతరకరం, అనైతికం, హేయమైనవని, ఆమె నేరానికి పాల్పడిందని ఎథిక్స్ ప్యానెల్ తెలిపింది. మహువా మోయిత్రాను ఎంపీగా కొనసాగించడానికి అనుమతించకూడదని, ఆమె సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఎథిక్స్ కమిటీ ఆ నివేదికలో సిఫార్సు చేసింది. అంతేకాదు.. మోయిత్రా చర్య (పార్లమెంటరీ లాగిన్ వివరాల్ని వ్యాపారవేత్త దర్శన్ హిరానందానితో పంచుకోవడం)ను నేరపూరితంగా కమిటీ అభివర్ణించింది. ఆమెను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై చట్టపరమైన, సమగ్రమైన, సంస్థాగత దర్యాప్తుని చేపట్టాలని కూడా కమిటీ సూచించింది. తన పార్లమెంటరీ లాగిన్ వివరాల్ని అనధికార వ్యక్తులతో మోయిత్రా పంచుకున్నారని, ఆమె పార్లమెంట్ ప్రత్యేక హక్కును ఉల్లంఘించారని ఆరోపించింది. ఈ కమిటీ సిఫార్సును నేడు (శుక్రవారం) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించనున్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఈ ప్రతిపాదనపై నిర్ణయం తీసుకోనున్నారు. కాగా ఎథిక్స్ కమిటీ నివేదికలోని అంశాలు ఆమోదానికి ముందే మీడియాలో రావడంపై మహువా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు.

ప్రతిపక్ష సభ్యుల అసమ్మతి

మహువాపై చర్యలను తప్పుపడుతూ, ఛైర్మన్ అడిగిన అనైతిక ప్రశ్నలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీల సభ్యులు అసమ్మతి నోట్లు సమర్పించారు. కాంగ్రెస్ ఎంపి వి. వైతిలింగం, సిపిఎం ఎంపి పి.ఆర్ నటరాజన్, జెడియు ఎంపి గిరిధారి యాదవ్, బిఎస్పీ ఎంపి కున్వర్ డానిష్ వేర్వేరుగా అసమ్మతి నోట్లు అందజేయగా, కాంగ్రెస్ ఎంపి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆన్‌లైన్‌లో సమర్పించారు.

ఇదే తొలిసారి

ఒక ఎంపీని బహిష్కరించాలని లోక్‌సభ ఎథిక్స్ కమిటీ సిఫారసు చేయడం బహుశా ఇదే తొలిసారి అని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పిడిటి ఆచారి తెలిపారు. 2005లో 'ప్రశ్నకు నోటు' కేసులో 11 మంది ఎంపిలను పార్లమెంట్ నుండి బహిష్కరించారు. అయితే ఆ బహిష్కరణలను రాజ్యసభ ఎథిక్స్ కమిటీ, లోక్‌సభ విచారణ కమిటీ సిఫార్సు చేశాయన్నారు.

నగదు చలామణి రెట్టింపు

- పెద్ద నోట్ల రద్దు అనంతర పరిస్థితిపై సర్వే

న్యూఢిల్లీ : 2016 నవంబర్ 7న మోడీ ప్రభుత్వం రూ.500, రూ.1000 నోట్ల చలామణిని రద్దు చేసింది. నల్లధనాన్ని వెలికితీసేందుకే ఈ చర్య తీసుకున్నామంటూ వివరణ ఇచ్చింది. ఆ తర్వాత నగదు లావాదేవీలను తగ్గించడానికి యూపీఐ, ఇతర డిజిటల్ చెల్లింపుల పద్ధతులను ప్రవేశపెట్టింది. అయినప్పటికీ గత ఏడు సంవత్సరాల్లో దేశంలో నగదు చలామణి రెట్టింపు అయింది. 2016 నవంబరులో రూ.17 లక్షల కోట్ల నగదు చలామణిలో ఉండగా ఈ ఏడాది అక్టోబర్‌లో అది రూ.33 లక్షల కోట్లకు పెరిగిందని ఓ సర్వేలో వెల్లడైంది. మేలో దేశ మొత్తం రిటైల్ డిజిటల్ చెల్లింపుల్లో 78 శాతానికి పైగా యూపీఐ ద్వారానే జరిగాయి. అయినప్పటికీ గత ఏడేళ్లలో ఆస్తులు కొనుగోలు చేసిన వారిలో 76 శాతం మంది కొంత మొత్తాన్ని నగదు రూపంలోనే చెల్లించారు. యూపీఐ ద్వారా రూ.17.6 లక్షల కోట్ల విలువైన 1,140 కోట్ల లావాదేవీలు జరిగినప్పటికీ సర్వేలో పాల్గొన్న 15శాతం మంది తాము 50శాతం వరకూ చెల్లింపులను నగదు రూపంలోనే చేశామని చెప్పారు. 18శాతం మంది 30శాతం-50శాతం నగదు చెల్లింపులు జరపగా, 15శాతం మంది 0-10శాతం వరకూ నగదు రూపంలో చెల్లించామని తెలిపారు. వాహనాలు, ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలుకు మినహా చాలా మంది తమ కుటుంబ అవసరాలకు నగదు చెల్లింపులే జరుపుతున్నారు. 26శాతం మంది భారతీయులు నిత్యావసరాల కొనుగోలుకు నగదు చెల్లింపుల పైనే ఆధారపడుతున్నారు. 11,189 మంది పౌరుల్లో కేవలం 15శాతం మంది మాత్రమే నగదు లావాదేవీలు జరపడం లేదు. గత సంవత్సర కాలంలో ఏడు శాతం మంది దీర్ఘకాలిక ఆస్తులతో పాటు బంగారం, వాహనాల కొనుగోలుకు నగదే చెల్లించారు.

సుప్రీంకోర్టు జడ్జీలుగా ముగ్గురు ప్రమాణం

- 34కి పెరిగిన న్యాయమూర్తుల సంఖ్య

న్యూఢిల్లీ : గురువారం ముగ్గురు కొత్త న్యాయమూర్తులను సుప్రీంకోర్టు స్వాగతించింది. దీంతో అత్యున్నత న్యాయస్థానం పూర్తి స్థాయి సామర్థ్యాన్ని సముపార్జించుకున్నట్లైంది. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, రాజస్థాన్, గువహటి ప్రధాన న్యాయమూర్తులు అగస్టీన్ జార్జి మసిహ్, సందీప్ మెహతాలు సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రమాణం చేస్తున్న జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, జస్టిస్ అగస్టీన్ జార్జ్, జస్టిస్ సుదీప్ మెహతా

వారి పేర్లను కొలీజియం సిఫార్సు చేసిన మూడు రోజుల్లోపే ఈ ప్రమాణ స్వీకారం జరిగింది. కాగా, కేవలం అక్టోబరు మాసంలోనే దాదాపు 5 వేల కేసులు దాఖలయ్యాయి. కాగా మరోవైపు రాబోయే 24 గంటల్లో పెండింగ్ కేసులు 80వేలకు చేరనున్నాయని జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జెడిజి) డాష్ బోర్డ్ తెలియచేస్తోంది. నవంబరు 9 సాయంత్రానికి నమోదైన, నమోదు కాని కేసుల సంఖ్య 79,717కి చేరినట్లు సుప్రీం కోర్టు వెబ్‌సైట్ పేర్కొంటోంది. వీటిలో 24,834 కేసులు ఏడాది కాలం లోపలవే. అక్టోబరులో మొత్తంగా 4,915 కేసులు నమోదు కాగా, 4,454 కేసులు పరిష్కారమయ్యాయి. 2023లో ఇప్పటివరకు మొత్తంగా 47,135 కేసులు నమోదు కాగా, 46,193 కేసులు పరిష్కారమయ్యాయి. సుప్రీం కోర్టులో నెంబరు 2 స్థానంలో వున్న జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ డిసెంబరు 25న రిటైరవనున్నారు. అప్పటివరకు 34మంది న్యాయమూర్తులతో పూర్తి స్థాయి సామర్థ్యంతో సుప్రీం పనిచేస్తుంది.

పొలాల్లో మంటలు పెడితే కేసులు

- రైతులకు పంజాబ్ ప్రభుత్వం హెచ్చరిక

న్యూఢిల్లీ: వరి గడ్డిని కాల్చేస్తున్న రైతులపై కఠినంగా వ్యవహరించాలని పంజాబ్ ప్రభుత్వం పోలీసులకు, రాష్ట్ర పరిపాలనకు వివరణాత్మక ఆదేశాలు జారీ చేసింది. పంజాబ్‌లో ఈ సీజన్‌లో దాదాపు 23,000 వ్యవసాయ అగ్నిప్రమాదాల కేసులు నమోదయ్యాయి. ఈ నెల 6 వరకు ఐపిసి సెక్షన్ 188 కింద 18 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని సమాచారం. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆయన మంత్రివర్గంలోని ముగ్గురు సభ్యుల స్వస్థలమైన సంగ్రూర్‌లో బుధవారం అత్యధిక సంఖ్యలో పొలాల్లో మంటల కేసులు నమోదయ్యాయి. పంట పొలాల వ్యర్థాల దహనంపై రోజువారీ సమాచారం వచ్చిన తర్వాత జిల్లా మేజిస్ట్రేట్లు, పోలీసు కమిషనర్లు, సీనియర్ పోలీసు సూపరింటెండెంట్లు (ఎస్-ఎస్పీలు) సంయుక్తంగా సమీక్ష సమావేశం నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనురాగ్ వర్మ కోరారు. జిల్లా మేజిస్ట్రేట్‌లు, ఎస్ఎస్పీలు కూడా క్రమం తప్పకుండా క్షేత్ర పర్యటనలు నిర్వహించాలని కోరారు. ప్రత్యామ్నాయలు చూపకుండా కేసులు పెడతామని బెదిరించడంపై రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాయితీ ధరకు అందించే పంట వ్యర్థాల నిర్వహణ యంత్రాలకు లక్షలాది మంది రైతులు దరఖాస్తు చేసుకున్నా కొందరికి మాత్రమే మంజూరయ్యాయని, విధిలేని పరిస్థితిలోనే వ్యర్థాలను కాల్చివేయాల్సివస్తోందని భారతీయ కిసాన్ యూనియన్ (డాకుందా) ప్రధాన కార్యదర్శి జగ్‌మోహన్ సింగ్ తెలిపారు. 'రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5 లక్షల మంది రైతులు పంట వ్యర్థాల నిర్వహణ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే 25 వేల మందికే మంజూరు చేశారు. యంత్రాల లభ్యతకు, డిమాండ్‌కు మధ్య అంతరం రైతులను పంట వ్యర్థాలను తగలబెట్టేలా చేస్తోంది' అని ఆయన పేర్కొన్నారు.

ప్రజలు మళ్లీ జగనే కావాలంటున్నారు

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన వై ఎపి నీడ్స్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నందునే ప్రజలు మళ్లీ జగనే కావాలంటున్నారని పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి ప్రతి సచివాలయం పరిధిలో చేపట్టిన వై ఎపి నీడ్స్ జగన్ అనే కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో ఒక సచివాలయ పరిధిలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సచివాలయాల వద్ద జరిగిన ఈ కార్యక్రమాలను వైసిపి మండలాధ్యక్షులు ప్రారంభించారు. తణుకు పట్టణంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వై ఎపి నీడ్స్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. చంద్రబాబు హయాంలో 17వ స్థానంలో ఉన్న విద్యా వ్యవస్థ జగన్ పాలనలో మూడో స్థానంలోకి వచ్చిందన్నారు. కరోనా కష్టకాలంలో అన్ని రాష్ట్రాల కన్నా మిన్నగా అందరికీ మేలు చేశారని తెలిపారు. గుంటూరులో మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆధ్వర్యంలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది.

బందీలను విడుదలజేయాలి

- భారత ప్రభుత్వం విజ్ఞప్తి

న్యూఢిల్లీ: గాజాపై ఇజ్రాయిల్ గత 34 రోజులుగా యధేచ్చగా మారణకాండను కొనసాగిస్తుండగా, భారత్ ప్రభుత్వం హమాస్ పేరెత్తకుండా దాని చేతిలో బందీలుగా ఉన్నవారందరినీ తక్షణమే, బేషరతుగా విడుదల జేయాలని కోరింది. విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బాగ్చి వారం వారం నిర్వహించే మీడియా గోష్టిలో భాగంగా గురువారం నాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ, హమాస్- ఇజ్రాయిల్ ఘర్షణలకు సంబంధించి భారత్ తన వైఖరిని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీతో సహా పలువేదికలపై అనేక మార్లు స్పష్టం చేసిందని అన్నారు. 'ఇజ్రాయిల్‌పై జరిగిన భయానక దాడిని మేము తీవ్రంగా ఖండించాం, ఉగ్రవాదాన్ని ఇజ్రాయిల్ ఏమాత్రం సహించరాదని కోరుతున్నాము. అలాగే బందీలుగా వున్నవారిని తక్షణమే బేషరతుగా విడుదలజేయాలని కోరుతున్నాం' అని ఆయన అన్నారు.

కుల గణనను అడ్డుకోవటానికి ఒబిసి సర్వే

తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పడితే కాబోయే సిఎం ఒబిసి కేటగిరీ వారేనని ప్రధాని మోడీ, కేంద్రహోం మంత్రి అమిత్ షా అన్నారు. బీహార్, ఛత్తీస్‌గఢ్‌లలో ఒబిసి సమస్యపై కూడా వారిద్దరూ మాట్లాడుతున్నారు. ఈ ప్రకటనలను పరిశీలిస్తే, 2024లో బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల అత్యంత శక్తివంతమైన ఆయుధాన్ని ఎదుర్కోవడానికి రూపొందించిన ప్రచారంలో భాగంగానే ప్రధాని మోడీ, అమిత్ షా చేస్తున్న ఈ వ్యాఖ్యలు బలాన్ని చేకూరుస్తున్నాయి. కులగణనను అడ్డుకోవాలంటే.. త్వరలో ఒబిసి సర్వేను బిజెపి ప్రకటించవచ్చనే సంకేతాలొస్తున్నాయి.

బిజెపి ఎన్నికల ఎత్తుగడ

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల ఎన్నికల మధ్య విపక్షాల ఒబిసి పందాలపై బిజెపి అలర్ట్ అయిందా? కుల గణన అంశంపై విపక్షాల ప్రశ్నలపై బిజెపి మౌనం వహించడం గానీ, ప్రశ్నలు తప్పించుకోవడం గానీ కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని కార్నర్ చేసేందుకు కాంగ్రెస్, ఇతర విపక్షాలు సిద్ధమవుతున్న విషయంపై ఇప్పుడు బిజెపి ఎదురుదాడికి సిద్ధమైనట్టు లీకులిస్తోంది.. బీహార్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనలను బట్టి దీని వెనుక దాగిన నిగూడార్థం ఇదే. ఇటీవల ఢిల్లీలో బీజేపీకి చెందిన ఒబిసి నేతల భారీ సమావేశం జరిగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల బీహార్ పర్యటనలో నితీశ్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కులాలవారీ సర్వే నిర్ణయం తీసుకున్నప్పుడు తాను బీజేపీతో కలిసి ప్రభుత్వంలో ఉన్నానని చెప్పారు. దీంతో పాటు ఇటీవల నవంబర్ 1న జరిగిన బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఒబిసి సర్వేపై కీలక నిర్ణయం తీసుకున్నారు.

త్వరలో ఓబీసీకి సంబంధించి పెద్ద ప్రకటన వెలువడే అవకాశం ఉంది

హిందూస్థాన్ టైమ్స్‌లోని ఒక నివేదిక ప్రకారం, నవంబర్ 1న ఢిల్లీలో బిజెపి సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశం జరిగింది, ఇందులో ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా పాల్గొన్నారు. త్వరలో ఒబిసి సర్వేను భాజపా ప్రకటించాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. హిందువుల ఓట్లను విభజించాలనే ఏకైక ఉద్దేశంతో కాంగ్రెస్ కుల గణన వాగ్దానాన్ని పునరావృతం చేస్తుందని బిజెపి నేత ఒకరు చెప్పారు. ఒబిసి సర్వేను ప్రకటించడం ద్వారా ఆ వ్యూహాన్ని మట్టుబెట్టాం. మనం వ్యతిరేకించడం కనిపించినప్పుడే దాన్ని సమస్యగా మారుస్తారు. మనమందరం అంగీకరించి సర్వే హామీ ఇస్తే హిందూ ఓట్ల విభజన ఉండదు.

బిజెపి ఈ ప్రకటన వెనుక అర్థమేంటి?

వెనుకబడిన కులాలు, దళితులు 70% కంటే ఎక్కువ ఉన్న తెలంగాణలో, తాము గెలిస్తే తమ ముఖ్యమంత్రి ఒబిసి అని బిజెపి ఇప్పటికే ప్రకటించింది. కేంద్రమంత్రి, రాష్ట్ర ఇన్‌చార్జి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం హామీతో తమ పార్టీ ఇప్పటికే దృఢ సంకల్పాన్ని చూపిందని అన్నారు.

5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు 2023

చేతులు..కాళ్లు లేకున్నా చైతన్యం నింపుతోంది

- ఇసి బ్రాండ్ అంబాసిడర్‌గా వికలాంగ గిరిజన మహిళ
- నోటి పెయింటింగ్స్ ప్రత్యేకత చాటుతున్న నర్మదియా

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని దిందోరి జిల్లా కన్నత్ గ్రామానికి చెందిన నర్మదియా అనే ప్రత్యేక ప్రతిభావంతురాలైన గోండు గిరిజన మహిళను ఎన్నికల సంఘం ఓటర్లను చైతన్యపర్చటానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. నర్మదియాకు చేతులు, కాళ్ళు లేవు, అయినప్పటికీ ఆమె నోటితో రంగుల బొమ్మలు వేస్తుంది. 33 ఏళ్ల నర్మదియా ఇప్పటికీ స్నానం, కాలకృత్యాల కోసం పూర్తిగా తన తల్లి ఇద్దరు మేనకోడళ్ళపై ఆధారపడుతోంది. అద్భుతమైన పెయింటిగ్స్ వేస్తూ కళలను నమ్ముకొని జీవనం సాగిస్తున్న నర్మదియా ఎందరికో స్ఫూర్తి అని అందుకే ఆమెను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేశామని దిందోరి జిల్లా కలెక్టర్ వికాశ్ మిశ్రా పేర్కొన్నారు.

మన కోసం మనమే పోరాడాలి..

ఎన్నికల సంఘం తనను అంబాసిడర్ ఎంపిక చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఆమె ఓటర్ల సందేహాలను నివృత్తి చేయడంలోనూ ముందుంటున్నారు. 'మన కోసం మనమే కదలాలి. ఓటు హక్కు వినియోగించుకుందాం..' అంటూ ప్రజల్లో పోరాట స్ఫూర్తిని పెంపొందిస్తున్నారు. 'మన హక్కుల కోసం, అస్తిత్వం మనం పోరాడకపోతే ఇంకెవరు మన కోసం పోరాడుతారు' అని నర్మదియా అంటారు. 'నేను పిల్లలతో ఆడలేను కాబట్టి నేను నా నోటితో రంగులతో ఆడటం ప్రారంభించాను. గోండ్ పెయింటింగ్స్ వేస్తూ వాటిని విక్రయించి ఆత్మగౌరవంతో బతుకుతున్నా' అని ఆమె అన్నారు. ఆమె తన ఊరికి సరైన రోడ్డు నిర్మించాలని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి కావాలని కోరారు.

ఇడి దుర్వినియోగం

- ఇసికి కాంగ్రెస్ ఫిర్యాదు

న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు తమ పార్టీ నాయకులపై పక్షపాతపూరితంగా వ్యవహరిస్తున్నారని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా ఇడిని బిజెపి రాజకీయ సాధనంగా వాడుకుంటోందని ఇసికి సమర్పించిన మెమొరాండంలో పేర్కొన్నారు. రాజస్థాన్ పిసిసి అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోతాసరా నివాసంపై దాడులు చేశారని, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్‌కు నోటీసులు ఇచ్చారని వివరించారు. ఇడి ఛత్తీస్‌గఢ్‌లో బిజెపి ఎన్నికల ఏజెంట్‌గా పనిచేస్తోందని, ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్‌పై ధ్రువీకరించని ఆరోపణలతో ప్రకటనలు చేస్తోందని అన్నారు. అభిషేక్ మను సింఘ్వి నేతృత్వంలో పార్టీ నేతలు తారిక్ అన్వర్, ఉజిత్‌రాజ్‌తో కూడిన కాంగ్రెస్ ప్రతినిధి బృందం బుధవారం ఎన్నికల కమిషన్‌ను కలిసి, వినతిపత్రం సమర్పించింది. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న ఇడి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బిజెపి 'ఎన్నికల విభాగం'గా మారిన దర్యాప్తు సంస్థల కార్యకలాపాలను వెంటనే అడ్డుకోవాలని ఇసిని కోరామని చెప్పారు.

పొంగులేటి ఇంట్లో ఐటి, ఇడి తనిఖీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ఎంపి, పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఐటి, ఇడి అధికారులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని నందగిరిహిల్స్, ఖమ్మంలోని పొంగులేటి నివాసాలకు గురువారం వేకువజామున మూడు గంటలకే చేరుకున్న ఐటి, ఇడి బృందాలు విస్తృతంగా తనిఖీలు చేశాయి.ఎనిమిది వాహనాల్లో వచ్చిన అధికార బృందాలు మూకుమ్మడిగా లోపలికి ప్రవేశించి కుటుంబ సభ్యుల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయి. గురువారం నామినేషన్ వేసేందుకు పొంగులేటి సిద్ధమవుతున్న సమయంలోనే సోదాలు జరగటం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నివాసంలో బుధవారం పోలీసులు సోదాలపై స్పందిస్తూ, తన నివాసాల్లోనూ ఐటి దాడులు చేయవచ్చని పొంగులేటి ముందే పసిగట్టారు. ఈ పరిణామాలపై పొంగులేటి స్పందిస్తూ దీంతో బిఆర్ఎస్, బిజెపి స్నేహం ఏ విధంగా ఉందో అందరికీ అర్థమైందన్నారు. దాడులతో కాంగ్రెస్ నాయకులను భయపెట్టలేరని పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క తెలిపారు.

యుద్ధాల్లో బలిపశువులు మహిళలే !

- ఐరాస ఆందోళన

రఫా సరిహద్దు వద్ద ఆహారం కోసం బారులు తీరిన మహిళలు, చిన్నారులు

న్యూయార్క్ : యుద్ధాలు, సైనిక ఘర్షణలు, చర్యల వల్ల అత్యంత తీవ్రమైన పర్యవసానాలను ఎదుర్కొనేది మహిళలు, ఆడపిల్లలేనని ఐక్యరాజ్య సమితి జనాభా నిధి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నటాలియా కనీమ్ హెచ్చరించారు. తాము చేయని తప్పుకు వారు మూల్యం చెల్లిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో బుధవారం అమె విలేకర్లతో మాట్లాడుతూ, గాజా, సూడాన్‌ల్లో జరుగుతున్న ఘర్షణలు చూస్తుంటే శాంతి అనేది ఎంత దుర్బలంగా వుందో తెలుస్తోందని అన్నారు. ప్రజలు నిర్వాసితలైనపుడు ఏం జరుగుతుందీ అన్నదానికి సెంట్రల్ ఆఫ్రికాలోని చాద్‌ను ఉదహరణగా కనీమ్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతి నిరుపేద దేశాల్లో చాద్ ఒకటైనప్పటికీ అక్కడ 10లక్షల మందికి పైగా శరణార్ధులు ఆశ్రయం పొందుతున్నారని ఆమె పేర్కొన్నారు. వీరిలో దాదాపు 5లక్షల మంది గత ఆరు మాసాల్లో సూడాన్ ఘర్షణల నుండి పారిపోయిన వారేనని ఆమె తెలిపారు. వారిలో అత్యధికులు మహిళలు, పిల్లలేనన్నారు. డిసెంబరు 10 ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానవ హక్కులపై ఐక్యరాజ్య సమితి హై కమిషనర్ కార్యాలయం (ఒహెచ్‌సిహెచ్‌ఆర్) ఒక నివేదికను ప్రచురించింది. ఏకపక్ష హత్యలు, వేధింపులు, లైంగిక హింస, బలవంతపు వివాహాలు ఇవన్నీ యుద్ధంలో అమలు చేసే ఎత్తుగడలని, వీటికి మహిళలే లక్ష్యాలని ఆ నివేదిక పేర్కొంది.

ప్రాంతీయ యుద్ధంగా మార్చే యత్నాలు

పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ 33 రోజులుగా ఏకధాటిగా సాగిస్తున్న నరమేధానికి అమెరికా ఆధ్వర్యంలోని జి-7 కూటమి వత్తాసు పలకడమే కాకుండా ఈ దురాక్రమణపూరిత యుద్ధాన్ని ప్రాంతీయ యుద్ధంగా మార్చాలని చూస్తున్నది. పశ్చిమ దేశాల అండ చూసుకునే రెచ్చిపోతున్న నెతన్యాహు గాజాలో యథేచ్ఛగా హంతక దాడులకు పాల్పడుతూ నెల రోజుల్లో 10వేల మందికిపైగా పాలస్తీనీయుల ప్రాణాలను బలిగొన్నాడు. అంబులెన్సులు, ఆసుపత్రులు, స్కూళ్లు, చర్చిలు, మసీదులు, చివరికి ఐరాస శరణార్ధి శిబిరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ బాంబు దాడులు చేస్తోంది. ఇజ్రాయిల్ దాడులను ఆత్మరక్షణ చర్యగా జి-7 దేశాలు అభివర్ణించాయి. జపాన్‌లోని టోక్యోలో బుధవారం సమావేశమైన జి-7 విదేశాంగ మంత్రులు ఇజ్రాయిల్ దాడులకు మద్దతు తెలిపారు. జి-7 ప్రకటన వెలువడిన తరువాత కొద్దిసేపటికే అమెరికా సిరియాపై వైమానిక దాడులకు తెగబడింది. తూర్పు సిరియాలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఇరాన్ ఆర్మీ) స్థావరాలను లక్ష్యంగా చేసుకుని తాము ఈ దాడులు జరిపామని అమెరికా చెబుతోంది. ఇరాన్‌ను కూడా ఈ యుద్ధంలోకి లాగే యత్నంలో భాగమే ఇది అని పరిశీలకులు పేర్కొంటున్నారు.

జెనిన్ శిబిరంపై భయానక దాడులు .. 10మంది మృతి

- రోజూ 4 గంటల పాటు మానవత విరామం

గాజా : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ నగరంపైన, అక్కడి శరణార్థుల శిబిరంపైన యూదు దురహంకార ఇజ్రాయిల్ సేనలు భీకర దాడులు జరిపాయి. ఈ దాడుల్లో 10మంది పాలస్తీనియన్లు మరణించగా, మరో 20మంది గాయపడ్డారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గురువారం తెల్లవారు జామున పెద్ద సంఖ్యలో ఇజ్రాయిల్ బలగాలు జెనిన్ శరణార్థి శిబిరంలోకి చొరబడ్డాయని పాలస్తీనా వార్తా సంస్థ వాఫా తెలిపింది. ఆ బలగాల వెంటే పెద్ద బుల్డోజర్ కూడా వచ్చిందని,రోడ్డు, మౌలిక వసతులపై దాడులు మొదలెట్టిందని, ఈలోగా శిబిరంపై కప్పులమీద ఎక్కిన సైనికులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారని పేర్కొంది.

ఇదిలా ఉండగా గాజాపై దాడుల్లో ప్రతి రోజూ నాలుగు గంటల పాటు మానవతా విరామాన్ని (హ్యూమానిటేరియన్ పాజ్) పాటించేందుకు ఇజ్రాయిల్ అంగీకరించిందని అమెరికా అధ్యక్ష భవనం తెలిపింది. మానవతావాద విరామం మూడు గంటల ముందుగా ప్రకటిస్తారని అమెరికా జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ చెప్పారు.

జనవరి 8 కుట్ర కేసులో ఐదుగురికి 15 ఏళ్లవరకు జైలు శిక్ష

- బ్రెజిల్ సుప్రీం కోర్టు తీర్పు

బ్రసీలియా : బ్రెజిల్ అధ్యక్షుడుగా ఎన్నికైన లూలా డసిల్వా విజయాన్ని తారుమారు చేసేందుకు ఈ ఏడాది జనవరి 8న జరిగిన కుట్ర కేసులో ఐదుగురికి సుప్రీం కోర్టు జైలు శిక్ష విధించింది. దీంతో ఇప్పటివరకు ఈ కేసులో దోషులుగా నిర్ధారణ అయిన వారి సంఖ్య 25కి చేరింది. సాయుధ తిరుగుబాటు నేరంలో పాలుపంచుకోవడం, ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ప్రక్రియను హింసాత్మకంగా రద్దుచేయడానికి ప్రయత్నించడం, కుట్రకు పాల్పడడం, విధ్వంసానికి దిగడం వంటి అభియోగాలపై వీరిని విచారించిన సుప్రీం కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది. అయితే వారికి విధించాల్సిన శిక్షలపై న్యాయస్థానం ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. 14నుండి 17ఏళ్ళ జైలు శిక్ష విధించాలని స్పీకర్, మంత్రి అలెగ్జాండర్ డీ మోరెస్ ప్రతిపాదించారు. మేజిస్ట్రేట్‌లు ఇరువురు ఆయనకు మద్దతిచ్చారు. అయితే మరో ఇద్దరు న్యాయమూర్తులు మాత్రం 11నుండి 15ఏళ్ళ పాటు శిక్ష విధించాలని ప్రతిపాదించారు. విధ్వంసానికి దిగి ప్రభుత్వ భవనాలకు నష్టం వాటిల్లేలా వ్యవహరించినందుకు ఈ ఐదురుగు కలిసి 30మిలియన్ల రియాస్ నష్టపరిహారంగా చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.

ముగిసిన హాలీవుడ్ నటీనటుల చారిత్రాత్మక సమ్మె

- వేతన పెంపు, ఎఐ వినియోగంపై కుదిరిన ఒప్పందం

లాస్‌ఏంజెల్స్: వేతనాలను పెంచాలని, కృత్రిమ మేధ (ఎఐ)కి వ్యతిరేకంగా హాలీవుడ్ నటీ నటులు నాలుగు మాసాలుగా సాగిస్తున్న చారిత్రాత్మక సమ్మె విజయవంతమైంది. అలయెన్స్ ఆఫ్ మోషన్ పిక్చర్స్ అండ్ టివి ప్రొడ్యూసర్స్ (ఎఎంపిటిపి)కి, స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ - అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టివి అండ్ రేడియో ఆర్టిస్టు (ఎస్ఎజి-ఎఎఫ్‌టిఆర్ఎ) మధ్య బుధవారం ఒప్పందం కుదరడంతో హాలీవుడ్ చిత్ర పరిశ్రమ ఊపిరిపీల్చుకుంది. మరి కొద్ది రోజుల్లో తిరిగి తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. నటీ నటుల సంఘం ఎస్ఎజి -ఎఎఫ్‌టిఆర్ఎ ప్రపంచవ్యాపితంగా 1,60,000 మంది వృత్తి నిపుణులకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, లాస్ ఏంజెల్స్ కేంద్రంగా ఏర్పడిన ఎఎంపిటిపి 350 మంది అమెరికన్ టెలివిజన్ అండ్ ఫిల్మ్ ప్రొడక్షన్ కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఇంచుమించు ఇవే డిమాండ్లపై హాలీవుడ్ రచయితలు నెల రోజుల పాటు నిర్వహించిన సమ్మె సెప్టెంబరు చివరి వారంలో ముగిసింది. 2023 జులై 14న ఈ సమ్మె మొదలైంది. స్టూడియోలతో కుదిరిన ఒప్పందం అసాధారణమైనదని, వంద కోట్ల డాలర్ల విలువైనదని ఎస్ఎజి-ఎఎఫ్‌టిఆర్ఎ ఒక ప్రకటనలో తెలిపింది. నటీ నట్టులకు మెరుగైన వేతనాలు చెల్లించేందుకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని విచ్చల విడిగా వాడకుండా తగు చర్యలు తీసుకునేందుకు, ఆర్టిస్టులకు కొన్ని రక్షణలు కల్పించేందుకు ఫిలిం ప్రొడక్షన్ కంపెనీలు అంగీకరించాయి.

మీ కోసం

తులసి ఆకులు నీళ్లలో వేసుకొని ప్రతిరోజూ తాగుతుంటే గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.

జీవన సారథం

విజయం కోసం చేసే ప్రతి ప్రయత్నమూ సఫలం కాకపోవచ్చు. కానీ ప్రయత్నమే చేయకపోతే ఏ ఫలితమూ రాదు.

ప్రకృతి మిత్రులు

తుళ్ళింతల తూనీగలు
ఎగిరే సీతాకోకలు
అల్లరి భ్రమరమ్ములు
మనకు ప్రకృతి మిత్రులు!

పువ్వులను చేరి అవీ
సంపర్కం కావించును!
కాయలు, పండ్లను ఇచ్చి
మన కడుపులు నింపును!

మట్టిలో వానపాములు
నేలలో సూక్ష్మజీవులు
క్రిములు, కీటకాదులు
మనకు ప్రకృతి మిత్రులు!

నేలసారం పెంచి అవీ
దిగుబడులను పెంచును!
నాణ్యమైన ధాన్యమిచ్చి
ఆరోగ్యం కలిగించును!

క్రిములను తినే పక్షులు
అక్షింతల పురుగులునూ
బుడి బుడి ఉడతలు, చీమలు
మనకు ప్రకృతి మిత్రులు!

ప్రకృతిలో జీవులన్నీ
మనకు సహజ మిత్రులు కదా!
పర్యావరణం కాపాడుతూ
మిగుల మేలు చేయు గదా!

- రావిపల్లి వాసుదేవరావు,
విజయనగరం,
94417 13136.



జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని చేప బొమ్మలు ఇచ్చాం. అయితే అవి రెండు భాగాలుగా చీలిపోయి ఉన్నాయి. మీరు జత చేయండి చూద్దాం. క్లూ ఉంది చూడండి.

నేను గీసినబొమ్మ

కె. సంజన
ఏడవ తరగతి,
జడ్పీ హెచ్ ఎస్ హవేళి ఘనపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వినియోగదారులకు విద్యార్థుల మేల్కొలుపు

గుండు సూది నుంచి విమాన ప్రయాణం వరకూ... తినే ఆహారం నుంచి ధరించే దుస్తులు... తొడుక్కునే చెప్పులు... బంగారు..వెండి ఆభరణాలు.. మార్కెట్లో కనిపించే ప్రతి వస్తువూ... తినే ఆహార పదార్థాలు.. తాగే నీరుతో సహా సమస్తం కల్తీల మయం.. డబ్బులు పోవటం మాట అటుంచితే మోసపోయామనే మానసిక కృంగుబాటును వినియోగదారులు ఎదుర్కొంటున్నారు. జరిగిన నష్టంతో కృంగిపోకుండా రాజ్యాంగం కల్పించిన హక్కులు- విధుల గురించి తెలుసుకుని ఆచరిస్తే జరిగిన నష్టానికి పరిహారం అందుకోవొచ్చు. దీనిపై విజయవాడ విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరాయ నగర పాలకసంస్థ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన వీడియోలు ప్రజానీకాన్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ప్రతిరోజూ ప్రతిఒక్కరూ టూత్ పేస్టు నుంచి ఇంట్లో సామాన్లు,నూనెలు, పప్పులు, కూరగాయలు, బిస్కెట్లు, తినే పదార్థాలు వంటివి కొనుగోలు చేస్తుంటారు. మందులు, పెట్రో ఉత్పత్తులు ఇలా ఏ వస్తువు కొన్నా దాని ముగింపు తేదీని చూసుకోవాల్సివుంది. వస్తువు కల్తీ, నకిలీయా అనేది కూడా ధృవీకరించుకోవాలి. వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర ప్రమాణం వంటి వాటికి సంబంధించి సమాచారం ఉన్నాయో లేదా పరిశీలించాలని దళవాయి సుబ్బరాయ నగర పాలకసంస్థ పాఠశాల విద్యార్థులు సూచిస్తున్నారు. వారు చేసిన వీడియోల సారాంశం ఈ కింది విధంగా ఉంది. చట్టాలపై సరైన అవగాహన లేకపోవటం, మాకెందుకులే అని సున్నితంగా తిరస్కరించటం వంటి కారణాలతో వదలేస్తే ఆ జాడ్యం సమాజ వ్యవస్థలపై చెడు ప్రభావాన్ని చూపిస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. హక్కులను గుర్తిస్తేనే రక్షణ పొందొచ్చు. 'వినియోగదారుడా' మేలుకో అంటూ పిలుపునిచ్చారు.

క్లబ్‌లతో వినియోగదారులకు అవగాహన

వినియోగదారుల హక్కుల చట్టాలకు సంబంధించి 13 అంశాలపై అవగాహన, విశ్లేషణలకు పాఠశాలలో రెండు క్లబ్‌లు ఏర్పాటయ్యాయి. సిబ్బంది ద్వారా ఏర్పాటైన క్లబ్‌కు అధ్యక్షులుగా ప్రధానోపాధ్యాయులు ఎం.కోటయ్య, ఉపాధ్యక్షులుగా వి.రాజ్యలక్ష్మి, కార్యదర్శిగా జె.భానుప్రకాష్, కోశాధికారిగా సిహెచ్‌విఎస్‌వి ప్రసాద్, సభ్యులుగా కె.శివపార్వతి, కె.నాగరాజు, సిహెచ్ వసంతలక్ష్మి, ఎం.కమలకుమారి, కె.సుమలత ఉన్నారు. విద్యార్థుల క్లబ్‌కు అధ్యక్షులుగా కె.సుమంత్ (9వ తరగతి), కార్యదర్శిగా పి.పావని దుర్గ (8వ తరగతి), ప్రధానోపాధ్యాయులు ఎం.కోటయ్య, టీచర్ గైడ్‌గా పులిపాటి దుర్గారావు వ్యవహరిస్తున్నారు. 8, 9 తరగతులు చదివేవారిలో మొత్తం 100 మంది విద్యార్థులు క్లబ్‌లో సభ్యులుగా ఉన్నారు. తెలుగు ఉపాధ్యాయులు ఆర్‌బి ఉదయ్ కిరణ్ సాంకేతిక సహకారం అందించారు. 13 రకాల చట్టాలు-అంశాలపై ఒక్కొక్క విద్యార్థి సమగ్రంగా అధ్యయనం చేయటం, వీడియో ద్వారా తెలియజెప్పేలా తర్ఫీదును ఇచ్చారు. తద్వారా ఈ వీడియోలు నేడు సామాజిక మాధ్యమాల్లో వినియోగదారుల హక్కులను కాపాడే కృషిలో ఉపయోగపడుతున్నాయి.

- యడవల్లి శ్రీనివాసరావు

భావి తరాలకు ఆదర్శం కావాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఇచ్చిన ఆదేశాల మేరకు విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించటం కోసం కన్స్యూమర్ క్లబ్‌లను ఏర్పాటుచేశాం. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపిఎ) తరపున ఈనెల ఆరోతేదీన మా పాఠశాలకు వచ్చిన ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ సురేష్‌మిశ్రా వినియోగదారుల పరిరక్షణ చట్టం గురించి మా విద్యార్థులకు వివరించారు. రాష్ట్ర కన్స్యూమర్ ప్రొటెక్షన్ అధికారి పివివి సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి జి.మోహనబాబు, సహాయ పౌరసరఫరాల అధికారి (సర్కిల్-1) శ్రీలక్ష్మి, సర్కిల్-2 పి.ధనుంజయరెడ్డి, సివిల్ సప్లయిస్ ఇన్‌స్పెక్టర్లు వెంకట్, శివ, శ్రీను అభినందించారు.

- మాతంగి కోటయ్య, ప్రధానోపాధ్యాయులు

విద్యార్థుల్లో సరికొత్త నైపుణ్యం

సమాజంలోని అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. మావంతుగా ఆ కృషి జరుగుతోంది. మొత్తం 13 అంశాలపై అవగాహన, చట్టాలపై సమగ్ర విషయ పరిజ్ఞానం పిల్లలకు తెలియజేశాం. వారి ఎంతో చక్కగా చెబుతున్నారు. ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు వస్తు సేవల వినియోగం, రక్షణ పద్ధతుల గురించి తెలియజేస్తే వారు ఆచరణలో పాటిస్తున్నారు. ఆధార్, బ్యాంక్ ఓటీపీలు చెప్పమని వస్తున్న ఫేక్ ఫోన్ కాల్స్‌కు ఖాతాల్లోని బ్యాలెన్స్‌లు ఖాళీ అవుతున్నాయి. ఆన్‌లైన్ ఆర్డర్లలోనూ, పార్శిళ్లలోనూ కూడా మోసాలు జరగకుండా తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు.

-పులిపాటి దుర్గారావు, క్లబ్ గైడ్ టీచర్

హక్కులు తెలుసుకోవటం బాధ్యతే

మా క్లబ్‌లో దాదాపుగా 100 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. రాజ్యాంగపరమైన హక్కులు, వినియోగదారుల రక్షణ చట్టాలకు సంబంధించిన వాటిపై సమగ్రమైన సమాచారంతో వీడియోలు చేశాం. మా సందేశం చూసి కొందరైనా తెలుసుకుని అవినీతి నిరోధానికి, ఆరోగ్యవంతమైన సమాజం కోసం పాటుపడతారని ఆశిస్తున్నాం.

వెన్నా జయశ్రీ, 9వ తరగతి

తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం

ఏది కొనుగోలు చేసినా బిల్లులు పొందటం ప్రాథమిక హక్కుగా భావించాలి. తద్వారానే గ్యారంటీ, వారెంటీల గురించి తెలుస్తుంది. గడువు ముగిసిన వస్తువులను అంటగడితే నష్టపరిహారం పొందటంతోపాటుగా పంపిణీ చేసిన కంపెనీలకు జరిమానాలను సైతం వినియోగదారుల ఫోరంలు విధిస్తాయి. అందరం వినియోగదారులమే. మా తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం.

కె.సుమంత్, 9వ తరగతి

ఫోరంను ఆశ్రయిస్తే న్యాయం



ఏ రకంగా మోసపోయినా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదులు చేయొచ్చు. ఆయా స్థాయిల్లో ధృవీకరణలు జరిగాక మోసం నిజమైనదైతే బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలను ఫోరం తీసుకుంటుంది.

- జి.పవిత్ర, 9వ తరగతి విద్యార్థిని

బాలీవుడ్ నటవారసుల 'ది ఆర్చీస్'

బాలీవుడ్ నటవారసులను పరిచయం చేస్తూ 'ది ఆర్చీస్' వెబ్ సిరీస్ తెరకెక్కుతోంది. తాజాగా ఈ వెబ్‌సిరీస్ నుండి ట్రైలర్ విడుదల చేశారు. అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నందా, శ్రీదేవి చిన్న కూతురు ఖుషీ కపూర్, షారూఖ్ ఖాన్ తనయ సుహానా ఖాన్‌తో పాటు మిహిర్ అహుజా, వేదంగ్ రైనా- యువరాజ్ మెండా తదితరులు ఈ సిరీస్‌లో నటిస్తున్నారు. 'గల్లీబోయ్' చిత్రాన్ని తెరకెక్కించిన జోయా అక్తర్ దీన్ని రూపొందిస్తున్నారు. డిసెంబర్ 7న నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. లైఫ్‌లో ఏదైనా సాధించాలి అని తపనపడే స్కూల్ కిడ్స్ చివరికి తమ జీవితాల్లో ఏం సాధించారన్నది 'ఆర్చీస్' థీమ్. వారికి అత్యంత ఇష్టమైన పార్కును మాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, దానిని రక్షించడానికి ప్రయత్నిస్తూ సుహానా-ఖుషీ బృందం చేసే ప్రయాత్నాలు ట్రైలర్‌లో చూపించారు.

కూతురు ఉంటే బాగుండేది

'ఇంతకు ముందు తండ్రి పాత్రలలో నటించాను. కానీ హాయ్ నాన్న సినిమాలో ఓ అమ్మాయికి తండ్రిగా నటించడం కొత్త అనుభూతినిచ్చింది. నాకు మొదటి నుంచి ఆడపిల్లలంటే ఇష్టం. ఈ సినిమాలో నటించడం మొదలు పెట్టాక కూతురుతో ఎలా ఉండాలో అనుభవం వచ్చింది. అందుకే నాకు ఓ కూతురుంటే బాగుండనిపిస్తోంది' అని నాని అన్నారు. నాని ప్రస్తుతం 'హాయ్ నాన్న' సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ మూవీ ప్రమోషన్లలో భాగంగా బుధవారం ప్రముఖ ఆంగ్ల మీడియా ఇండియా టూడే నిర్వహించిన తెలంగాణ రౌండ్‌టేబుల్ 2023 సమావేశానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాని సినిమా విశేషాలతో పాటు పైవిధంగా తన వ్యక్తిగత విషయాలపై కూడా స్పందించారు. ప్రస్తుతం నాని చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. డైరెక్టర్ శౌర్యువ్ రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమా డిసెంబర్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇందులో నాని, మృణాల్ ఠాకూర్, నాని కుతురిగా కియారా ఖన్నా నటిస్తోంది. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు.

'సప్త సాగరాలు దాటి సైడ్ బి' మెప్పిస్తుంది : రక్షిత్‌శెట్టి

సప్త సాగరాలు దాటి సైడ్ బి సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుందని చిత్ర కథానాయకుడు రక్షిత్ శెట్టి అన్నారు. సెప్టెంబర్‌లో విడుదలైన 'సప్త సాగరాలు దాటి సైడ్ ఎ'కు సీక్వెల్‌గా 'సప్త సాగరాలు దాటి సైడ్ బి' కన్నడ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి. విశ్వ ప్రసాద్, వివేక్ కూచిభొట్ల తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. హేమంత్ రావు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రక్షిత్ శెట్టి, రుక్మిణీ వసంత్, చైత్ర జె. ఆచార్ ప్రధాన పాత్రలలో నటించారు. ఈనెల 17న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా చిత్ర బందం ప్రెస్ మీట్ నిర్వహించి చిత్ర విశేషాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందంతో పాటు తెలుగు సినీ పరిశ్రమకు చెందిన దర్శకులు కేవీ అనుదీప్, శ్రీనివాస్ అవసరాల పాల్గొన్నారు.

పుష్ప-2, సలార్ షూటింగ్ షురూ...

హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో పుష్ప-2, సలార్ సినిమాల షూటింగ్ చిత్రీకరణలతో సందడిగా ఉంది. 'పుష్ప 2' కోసం సుమారు వెయ్యిమంది డ్యాన్సర్లపై సాగే పాటని తెరకెక్కిస్తున్నారు. గణేశ్ ఆచార్య ఈ పాటకి నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. నెల రోజులుపైగానే సాగే ఈ షెడ్యూల్‌లో ఓ పోరాట ఘట్టం, కొన్ని కీలక సన్నివేశాల్ని కూడా తెరకెక్కించనున్నట్టు సమాచారం. 'పుష్ప'కు సీక్వెల్‌గా 'పుష్ప2' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు సుకుమార్. అల్లు అర్జున్, రష్మిక జంటగా నటిస్తున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ స్వరకర్త. ప్రభాస్ హీరోగా నటిస్తున్న చిత్రం సలార్. ప్రశాంత్ నీల్ ఈ సినిమా దర్శకుడు. తెరకెక్కిస్తోన్న ఈ సినిమా చిత్రీకరణ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. సిమ్రత్‌కౌర్ తదితరులపై ఓ ప్రత్యేక గీతాన్ని రూపొందిస్తున్నారు. రాజు సుందరం మాస్టర్ నృత్య దర్శకత్వం వహిస్తున్నారు. హోంబలే ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రుతిహాసన్ కథానాయికగా, పృథ్వీరాజ్ ప్రతినాయకుడి పాత్రలోనూ నటిస్తున్నారు. డిసెంబరు 22న ఈ సినిమా విడుదల కానుంది.

టెక్నాలజీతో చెత్త క్రియేషనా?



'సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న డీప్‌ఫేక్ వీడియో చూస్తుంటే భయం వేస్తోంది. ఇలాంటి చెత్త వీడియోలను క్రియేట్ చేసే వ్యక్తి.. ఆ టెక్నాలజీని, విలువైన సమయాన్ని ఏదైనా మంచి పనికి ఉపయోగించాల్సింది. ప్రస్తుతం అభివృద్ధి చెందిన ఈ టెక్నాలజీ మనకు వరమో లేక శాపమో అర్థం కావట్లేదు. ప్రేమను, మంచి పంచడం కోసం ఈ టెక్నాలజీని ఉపయోగిద్దాం. అంతేకానీ చెత్తను పంచుకోవడం కోసం కాదు' అని కీర్తి సురేశ్ ట్వీట్ చేశారు. కొన్ని రోజుల క్రితం రష్మిక డీప్‌ఫేక్ వీడియో అంశం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. సినీ ప్రముఖుల నుంచి మొదలు ప్రభుత్వ పెద్దల వరకు ఈ అంశాన్ని సీరియస్‌గా పరిగణించారు. ఈ వీడియోపై అమితాబ్ బచ్చన్, నాగ చైతన్య, మంచు విష్ణు, విజయ్ దేవరకొండ, మృణాళిని ఠాగూర్ లాంటి అగ్ర నటీనటులు స్పందించారు. తాజాగా కీర్తి సురేశ్ కూడా సోషల్ మీడియా వేదికగా రష్మిక డీప్‌ఫేక్ వీడియో ఘటనపై స్పందించారు.

గురి తప్పని మహిళా ఆర్చర్లు

- వ్యక్తిగత విభాగంలో పర్నీత్ కౌర్‌కు స్వర్ణం
- ఒకేరోజు మూడు బంగారు పతకాలు కైవసం
- ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్స్

బ్యాంకాక్: ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు ఒకేరోజు మూడు స్వర్ణ పతకాలు దక్కాయి. గురువారం జరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్, మహిళల టీమ్ విభాగాలతోపాటు, వ్యక్తిగత విభాగంలో స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖను ఓడించి పర్నీత్ బంగారు పతకాన్ని ముద్దాడింది. అదితి స్వామి, పర్నీత్ కౌర్, వెన్నం జ్యోతి సురేఖలతో కూడిన మహిళా ఆర్చర్ల బృందం 234-233పాయింట్ల తేడాతో చైనీస్ తైపీకి చెందిన హి-హుసాన్, హంగ్ లీ, వాంగ్-లూలను చిత్తుచేసి భారత్‌కు మొదటి బంగారు పతకాన్ని ఖాయం చేశారు. ఆ తర్వాత వ్యక్తిగత విభాగంలో పర్నీత్ కౌర్ 145-145పాయింట్లతో సమంగా నిలిచి.. షూట్ ఆఫ్‌లో 9-8పాయింట్ల తేడాతో జ్యోతి సురేఖపై సంచలన విజయం సాధించింది. ఇక మిక్స్‌డ్ కాంపౌండ్ విభాగంలో అదితి స్వామి-ప్రియాన్ష్ జోడీ 156-151పాయింట్ల తేడాతో థాయ్‌లాండ్ జోడీని చిత్తుచేసి భారత్‌కు మూడో స్వర్ణ పతకాన్ని ఖాయం చేశారు. పురుషుల వ్యక్తిగత విభాగంలో అభిషేక్ వర్మ 147-146పాయింట్ల తేడాతో దక్షిణ కొరియాకు చెందిన జీ-జేహూన్‌ను చిత్తుచేసి కాంస్య పతకాన్ని చేజిక్కించుకోగా.. మహిళల రికర్వ్, పురుషుల టీమ్ విభాగాల్లో భారత్‌కు రెండు కాంస్య పతకాలు దక్కాయి. దీంతో ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు దక్కిన పతకాల సంఖ్య ఏడుకు చేరింది. ఇందులో మూడు స్వర్ణ, ఒక రజత, మూడు కాంస్య పతకాలు ఉన్నాయి.

సెమీస్‌కు చేరువలో న్యూజిలాండ్

- చివరి లీగ్‌లో శ్రీలంకపై ఐదు వికెట్ల తేడాతో గెలుపు

బెంగళూరు: ఐసిసి వన్డే ప్రపంచకప్ సెమీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు సమిష్టిగా రాణించింది. తొలుత శ్రీలంకను 171పరుగులకే పరిమితం చేసిన న్యూజిలాండ్.. ఆ లక్ష్యాన్ని 23.2ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో గురువారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఆల్ రౌండ్ షో ప్రదర్శించింది. టాస్ గెలిచిన విలియమ్సన్ తొలిగా బౌలింగ్‌కు మొగ్గు చూపింది. శ్రీలంక జట్టు 128పరుగులకే 9 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న దశలో తీక్షణ(38), మధుశంక(19) కలిసి 10వ వికెట్‌కు 43పరుగులు జతచేశారు. న్యూజిలాండ్ బౌలర్లు బౌల్ట్‌కు మూడు, ఫెర్గుసన్, సాంట్నర్, రవీంద్రకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భాగంగా కివీస్ ఓపెనర్లు డెవాన్ కాన్వే(45), రచిన్ రవీంద్ర(42) తొలి వికెట్‌కు 86 పరుగులు జోడించారు. ఆ తర్వాత కెప్టెన్ కేన్ విలియమ్సన్(14) విఫలమైనా.. డారిల్ మిచెల్(43) ఫర్వాలేదనిపించాడు. గ్లెన్ ఫిలిప్స్(17), టామ్ లాథమ్(2) అజేయంగా నిలిచి జట్టును గెలుపుతీరాలకు చేర్చారు. దీంతో న్యూజిలాండ్ కేవలం 23.2 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. శ్రీలంక బౌలర్లలో ఏంజెలో మాథ్యూస్‌కు రెండు, మహీశ్ తీక్షణ, దుష్మంత చమీరకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ట్రెంట్ బౌల్ట్‌కు లభించింది. ఈ గెలుపుతో న్యూజిలాండ్ ప్రస్తుతం 9మ్యాచ్‌లు ముగిసేసరికి 5విజయాలు, 10పాయింట్లతో రన్ రేట్ +0.74తో నాల్గోస్థానంలో ఉంది. ఇక పాకిస్తాన్(0.036), ఆఫ్ఘనిస్తాన్(-0.038)తో ఐదు, ఆరు స్థానాల్లో ఉన్నాయి. పాక్ జట్టు తన చివరి లీగ్ మ్యాచ్‌ను ఇంగ్లండ్‌తో తలపడనుంది.

వన్డే ప్రపంచకప్‌లో నేడు..
దక్షిణాఫ్రికా × ఆఫ్ఘనిస్తాన్
(వేదిక: అహ్మదాబాద్, మ.2.00గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68